శ్రీ
ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక.

కాకినాడ.

రెండు నెలల కొకసారి ప్రకటింపఁబడును.

(Journal of the Telugu Academy.)

సంపుటము. ౨౭ } బహుధాన్యనామసంవత్సరము. ఆశ్వయుజకార్తికమాసములు. { సంచిక ౪

గత కార్తికబహుళ పంచమీశనివారమున (12-11-38) పరిషత్పత్రికాసంపాదకులును, ఆంధ్రభాషాభిమానులు నగు బ్రహ్మశ్రీ కొత్తపల్లి సూర్యారావుగారాకస్మికముగ మరణించిరని వ్రాయుటకెంతయుఁ జింతిల్లుచున్నారము. వీరిభాషాభిమానము, కార్యదీక్ష, నిరాడంబరజీవితము నందఱికిని దెలిసినవే. వీరాంధ్రమునఁ బెక్కుగ్రంథముల రచించుటయేగాక తమిళము, కన్నడము మొదలగుభాషల జ్ఞానములవరచుకొని పరిషత్కార్యములఁ జక్కఁగ నిర్వహించియున్నారు. భగవంతుఁడు వీరియాత్మకు శాంతి నొసఁగుఁగాత.

పరిషత్కార్యదర్శులు.

కీర్తిశేషులగు క్రొత్తపల్లి సూర్యరావుగారి జీవితసంగ్రహము.

సాహిత్యవిశారద బ్రహ్మశ్రీ కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారు

"జాతస్య మరణం ధ్రువం" అనునట్లు పుట్టినవారు గిట్టుటసహజము. అయిన నీలోకమునం గొందరు మహనీయులు భంగురములగు భౌతికదేహములం బాసినను స్థిరతరములగు కీర్తిదేహములతోం జిరంజీవులై వెలయుచుందురు. అట్టి యశఃకాయులలో క్రొత్తపల్లి సూర్యరాయసూరిగా రొక రనుటకు సంశయములేదు.

ఈవిబుధవరుని జన్మస్థానము పీఠికాపురసమీపమున నున్న చెందుర్తియను గ్రామము. ఇందుఁ గ్రొత్తపల్లివారని ప్రసిద్ధిగాంచిన శ్రోత్రియకుటుంబమున రామయ్య సుబ్బమ్మగార్లను పుణ్యదంపతులకు నవమండ్రుపుత్రులు, ఇరువురు పుత్రికలు నుదయించిరి. ఈకుమారు లెల్లరు మేధానిధులు. విజ్ఞానఘనులు. ఈసోదరగణమున సూర్యరావుగా రారవవారు. వీరు చిన్ననాఁ డూరిసావడిబడిలోఁ దెలుగున వ్రాయను జదువను నేర్చి యట నంతకుఁబై విద్దెల నేర్పు పాఠశాల లేకుండుటచే నింటనున్న యన్నలకడఁ బురాణములయందలి మేలుపద్దెముల వ్రాసికొని కంఠపాఠము సేయుచుఁ గాలము గడుపుచుండిరి. ఇట్లు పదునారేండ్లవయసు వచ్చువఱకుఁ జాముర్తియందే వర్తించుచుండిరి.

ఇట్లుండగాఁ గాకినాడపట్టణమున గురజాడ శ్రీరామమూర్తి పంతులుగారిచే నెలకొలుపఁబడిన రాజయోగిపత్రికాముద్రణాలయమునకుఁ బాలకులుగానుండిన పారేపల్లి లక్ష్మీనారాయణగారు మిత్రులవలన సూర్యరావుగారి తెలివితేటలఁ దెలిసికొని, కాకినాడకు వారిఁ బిలిపించుకొని, వీరి సుహృత్స్వభావములకు సంతసమంది, తమ మందిరమునందే యుంచికొని పుత్త్రప్రేమతో నాదరించుచు, నచ్చుపని నేర్పుకొనుటకు

రాజయోగిముద్రణకార్యాలయమునఁ బ్రవేశపెట్టి, స్వయముగా ముద్ర
ణాదికార్యముల బోధింపఁదొడఁగిరి.

అంత నచిరకాలములోనే సూర్యరావుగారు పరసాహాయ్య
మక్కఱలేకయే స్వయముగా నక్షరములఁ గూర్చుటయందును, ముద్రిత
పత్రముల దిద్దుటయందును నేర్పరులై, పత్రికానిర్వాహకులగు లక్ష్మీ
నారాయణగారికిఁ గొంత కార్యభారము తగ్గింపఁజొచ్చిరి. ఈరీతిగా
నచ్చుపనుల నేర్చికొనుటయు కాక రాత్రులయందు శ్రీరామమూర్తి
పంతులుగారియొద్ద నాంధ్రప్రబంధములఁ జదువ మొదలిడిరి. విద్యార్థిదశ
నిట్లు హాయిగ సాగించుచుండ "కాలమొక్కరీతి గడువబోదు" అను
సామెతవడువున సూర్యరావుగారిని నందనుని పగిదిఁ బ్రేమించుచున్న
పారేపల్లి లక్ష్మీనారాయణమహాశయులు 1895 సం॥రం డిసెంబరు మా
సాన దివి కేగుటయు, గురజాడ శ్రీరామమూర్తిపంతులుగారు కాకినాడ
పురమును వీడి విజయనగరమునకుఁ జనుటయుఁ దటస్థమాయెను. అం
దుచే రాజయోగికార్యాలయము పాలకాభావమున మూయఁబడవలసి
వచ్చెను. కాని సూర్యరావుగా రప్పటికి నచ్చుకూటము నడిపింప నర్హ
మగునేర్పును తెలుఁగునఁ బుస్తకముల రచియింప నరువగు విజ్ఞానమును
గడించియుండిరి.

రాజయోగి యాగినకొలది వత్సరములకే పోలవరము జమీం
దారువారగు శ్రీకొచ్చెర్లకోట వేంకటకృష్ణారావుబహదూరువారు సర
స్వతీపత్రికాలయమును స్థాపించి దానికి శ్రీచిలకమర్తి లక్ష్మీనరసింహము
గారి నధిపతులనుగా నేర్పరచి, వారికి సహాయముగాఁ గార్యముల
సాగింపసమర్థుఁడగు బుద్ధిశాలికై వెదకుచున్న సంగతిని గురజాడ శ్రీరా
మమూర్తిపంతులుగారు తెలిసికొని సూర్యరావుగారి శక్తిసామర్థ్య
ముల నగ్గడించుచు నుత్తరము వ్రాసిరి. అంతపై జమీందారుగారు
సూర్యరావుగారిని సరస్వతీపత్రికాలయమున లక్ష్మీనరసింహముగారికి
సహాయకార్యదర్శిగా నియమించిరి. ఆతరినుండియే సూర్యరావుగారి
మేధావైభవము లభివృద్ధి నందఁజొచ్చినవి.

అపుడు పోలవరము జమీందారుగారియొద్దఁ బండితులుగానున్న దివాకర్ల తిరుపతిశాస్త్రిగారి సాహచర్యమున సంస్కృతసాహిత్యప్రావీణ్యమును చిలకమర్తి లక్ష్మీనరసింహకవిసింహుని నేస్తమునఁ దెలుగు కైతల నేర్పును సాకల్యముగా సమకూర్చికొని వీరు స్వయముఁగా గావ్యనిర్మాణము జేయఁదొడంగిరి. ఇట్లు క్రమముగాఁ గవివరులై వ్యాసరచనానిపుణులై ముద్రణాలయకార్యనిర్వహణదక్షులై సూర్యరావుగారు ప్రసిద్ధిగాంచిరి.

వీరు సరస్వతీపత్త్రికారాజమునఁ బురాతనాముద్రితగ్రంథముల నెన్నిటినో ప్రకటించిరి. వీరి ప్రయత్నములకుఁ బోలవరముజమీందారువారు చేదోడై తగుప్రోత్సాహమును సమకూర్చుచుండిరి. ఇట్లు పదేండ్లు వీరు సరస్వతీపత్త్రికాలయమునఁ బ్రభుసమ్మితముగను సజ్జనస్తుత్యముగను ఆత్మగౌరవానుకూలముగను కాలము గడుపుచు సుఖముగానుండ గ్రాంథికాంధ్రభారతీపదారవిందసమారాధనాసక్తచిత్తులగు శ్రీ జయంతి రామయ్యబుధవరేణ్యులు సూర్యరావుగారి గుణాతిశయములను, కార్యనిర్వహణప్రావీణ్యము విని, చెన్నపురినున్న యాంధ్రపరిషత్పత్త్రికాకార్యాలయమునఁ బనిసేయుటకు రండని పిలుపు నంపిరి. వీరు వారి పిలుపుపైఁ జెన్నపురమునకేగి, పదిరెండేండ్లటఁ గాపురము చేసి, పిమ్మట పరిషత్తు వెంటఁ గాకినాడపురమునకేతెంచి, బహుసమర్థతతో బండితప్రశంసార్హమగురీతిని నిదానముగాఁ బత్త్రికాకార్యములన్నిటిని నెరవేర్చుచు నిజకార్యాచరణనైపుణ్యముచేఁ బైయధికారుల గౌరవమునకుఁ బాత్రులై నిర్వదైదేఁడులు గడపి 1938 సం॥నవంబరు నెల పన్నెండవతారీఖు శనివారము పగలు పన్నెండుగంటల సమయాన నన్నకబళము నోటనిడుచు ననాయాసముగా నసువుల బాసిరి. ఇప్పటికి వీరివయసు అరువదియారు వత్సరములు. ఈ యనాయాసనిర్యాణము జూడఁ జూడ నీ ధీనిధిపూర్వభవమున యోగసమాధిభీరుఁడగు పుణ్యపురుషుఁడై కర్మశేషానుభవమునకుఁ దిరుగ నీరీతి నవతరించి ముక్తకర్ముఁడై ముక్తి నందెననుటకు సందియము లేదు. వీరిగుణసంపత్తిని వీరికిఁ బెద్దలయెడఁ గలభక్తిప్రపత్తులను

వివరముగా వ్రాయఁబూనినచోఁ నొకగ్రంథము కాఁగలదు. పత్రికాముఖమున నొక్కమారు వీరిప్రావీణ్యమునుగూర్చి తెలియఁజేయుటకు వలను గామిచే సంగ్రహముగ సూర్యరావుగారి పాండిత్యమును గూర్చి కొలఁదిగ ముచ్చటించి యీవ్యాసమును ముగింతును.

సూర్యరావుగారు సంస్కృతాంధ్రములఁ బండితులై యుండుట యేకాక, ఆంగ్లము, అరవము, కన్నడము, మహారాష్ట్రము, హిందీ, ఉరుదు భాషలయందుఁ జక్కని ప్రవేశముకల ధీమంతులు. వీరీభాషల యందుఁ బ్రకటితములగుచున్న పత్రికలను, కావ్యములనుజదివి, వాని యందలి యందములగు భాగముల వినువారికి వివరించుచుండెడివారు. అన్నిటికంటెను వీరియందెన్నఁదగు సుగుణమేది యన నకలంకమగు ప్రవర్తనము. మఱియు నిగర్వమునకు వీరిజీవిత ముదాహరణము. కలలోఁ గూడఁ బరుషములాడి యెఱుఁగరు. ఈకవిశిఖామణి యనేక గ్రంథముల విరచించియుండెను. అందుఁ గొన్ని ముద్రితములైనవి. మఱికొన్ని యచ్చు కాదగియున్నవి. వానిపట్టిక నిటనిచ్చుచున్నాను.

ముద్రితములు.

1. దుర్యోధనాభిమానము (నాటకము)
2. కన్యకాపరమేశ్వరి. (డిటో)
3. గుణమంజరి.
4. హరిశ్చంద్రమహారాజకథ.
5. హెత్రికివేయి విధములు.
6. కమలపాలిక.
7. ఆనందసాగరము.
8. రాజలక్ష్మి.
9. నీతిభవనము.
10. త్రిలోకసుందరి (నాటకము)
11. ఉదయార్కు.
12. సిరియాళచరిత్ర.

అముద్రితములు.

1. అమోఘరాఘవము (నాటకము.)
2. వీరకృష్ణరాయలు (డిటో)
3. శుద్ధాంధ్రనిరోష్ఠ్యనిర్వచన కుచేలోపాఖ్యానము.
4. జిరుగబిళ్ల.
5. సౌభాగ్యసుందరి (నాటకము)
6. బాలికాబోధన.
7. సమయమంత్రి (600 నీతివాక్యములు.)
8. శ్రీరామశతకము.
9. చతుర్గణికటకము.
10. స్వర్ణలీల.

13. రామలక్ష్మణులు.
14. వాసవదత్త.
15. కచదేవయానులపెండ్లి.
16. హమ్మీరదేహాంజ.
17. కళావిలాసము.
18. సంస్కృతకథాసారము.
19. బీరబలునివినోదములు.
20. నమస్కారములు.
21. షసానేఆజాయ్.

11. కిరాతార్జునీయము (వచనగ్రంథము.)
12. సువృత్తశతకము.
13. లోకోక్తులు (8 వేలు)
14. కాశీనాథశతకము.
15. అహ్లాదిని (పద్యకావ్యము)
16. జామాతృవిలాసము (నాటకము.)
17. రాజకళింగగంగు (డిటో)
18. సూర్యోదయమను పేరుగల స్వీయచరితము ద్విపదకావ్యము. ఇది వీరి తుదికృతి.

ఇవికాక వీరెన్నియో యమూల్యములగు వ్యాసముల వివిధ పత్రికలయందును బ్రకటింపఁజేసియుండిరి. నిజముగా నాంధ్రపరిషత్పత్రికాలయమున వీరివలెఁ గార్యములనేర్పుతో సాగింపఁగల కార్యనిర్వాహకులు సమకూరుట సందేహాస్పదము. సూర్యరావుగారు యువకులకు వినయవివేకాలంకృతమగు నిజజీవితము నుదాహరణముగఁ జూపుటయేకాక, వీరుచెందిన యనాయాసమరణముచేఁ జరఠులకుఁ దమనిర్యాణము సపేక్షణీయముగఁ జేసియుండిరి.

ప్రస్తుతము వీరికిఁ గలాకోవిదుఁడగు పుత్త్రుఁడును, సౌభాగ్యవతియగు పుత్త్రికయు, చిరంజీవియగు బాలదౌహిత్త్రుఁడును, విధేయుఁడగు నల్లుండును, సాధ్వీమణియగు నిల్లాలునుకలరు. కరుణాకరుఁడగు భగవానుఁడు వీరికుటుంబమువారికి నాయురారోగ్యాది భాగ్యములను, సూర్యరావుగారి యాత్మకుఁ గైవల్యానందమును నందఁజేయుఁగావుతయని ప్రార్థించుచున్నాను.

మేఘసందేశము—యక్షునిశాపము.

విమర్శకాగ్రేసర కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు.

కవిసార్వభౌముఁడగు కాళిదాసువ్రాసిన కావ్యములలోనికెల్ల చాల చిన్నదిగానుండు మేఘసందేశమను గ్రంథమునందలి విశేషము పరికించిచూడఁ జాలపెద్దదిగా నున్నది. అది కాళిదాసు బుద్ధివైభవము నుఁ బట్టి కథాకల్పనాదికము కలిగియున్నది. అదంతయు కల్పితమే. కుబేరుని ప్రభుత్వములో నున్న యొకానొకయక్షుఁడు మత్తుఁడై తాను చేయువలసిన స్వామికార్యములు తిన్నగా జేయకఁ దిరుగఁజొచ్చెననియు నందుమూలముచే నాయజమానుఁ డాయక్షునకు సంవత్సరమువఱకు ద్వీపాంతరవాసశిక్షను విధించి వానిని రామగిర్యాశ్రమములలో శయనైకాదశి మొదలు ఉత్థానైకాదశివఱకు అనగా సంవత్సర మనుభవింపవలసినదని కుబేరుఁ డాజ్ఞాపింపగా నారీతిగా ననుభవింప నాతడు మొదలుపెట్టెననియు చెప్పబడియున్నది. ఇట్లాశిక్ష నెనిమిదిమాసముల వఱ కనుభవించెనట. కాని యింతలో వర్షకాలము వచ్చినది. వర్షకాలము విరహులకు మిక్కిలి దుస్సహము. ఆదుస్సహకాలములో వియోగ మనుభవింపలేక, తనభార్య మృతిపొందునేమోయని జంకి యామెకొక సందేశమును బంపిన నామె జీవించుననను నాశతో నీనాల్గుమాసముల కాలములో శిక్షవలని వియోగమును గన్నుల మూసికొని మెల్లన గడపవలసినదని బోధించుచు సందేశమునంపెను. అదియట మేఘసందేశము. అదియక్షుఁడు విరహమత్తుఁడై యొడలుదెలియక జడమైనమేఘమెక్కడ సందేశముపట్టుకొని వెళ్లుట యెక్కడయని యాలోచింపక జడమతియై పంపెనట. ఈసందేశము పంపుట యాషాఢమాసములో ప్రథమదివసమునందు జరిగెనని మల్లినాథాదులు చెప్పుచున్నారు.

ఇంక మఱికొందఱది యాషాఢమాసములో ప్రశమదివసమున జరిగినదని నుడువుచున్నారు. ఈవిధముగా వివాదము చిరకాలమునుండి వచ్చుచున్నది. కాని మల్లినాథాదులు చెప్పినదియే పొరబాటని తోచుచున్నది. రెండవవారు చెప్పినదే సత్యమని తోచుచున్నది. ఈవాదమునుగూర్చి యింకను జర్చించుటకు పూర్వము మనము ముఖ్యముగా తెలిసికొని నిర్ణయింపవలసినది మాసములు లోకములో అమాంతములా పూర్ణిమాంతములాయనునదియై యున్నది. మల్లినాథసూరిగారు మాసములన్నియు నమాంతములే, యనగా నమావాస్యతో నంతమగునవని తలంచి తనవాదమును తీసుకొనివచ్చెను. మనయాంధ్రదేశప్రాంతమునందుగల మాసములన్నియు నమాంతములే. ఇంక నుత్తరదేశమునందుగల మాసములన్నియో పూర్ణిమాంతములు. అటులయిన మన యక్షునిశాపము సరిగ హెచ్చుతగ్గు లంతలేకుండ సరిపోవును. యక్షుని శాప మోక్ష మెప్పుడో గ్రంథమునందు స్పష్టముగ జెప్పఁబడియున్నది అదేదియన 'శాపాంతో మే భుజగశయనాత్ ఉత్థితే శార్ఙ్గపాణౌ' అని మూలమునందే తెల్పఁబడి యున్నది. కాన యక్షునిశాపము కార్తీక శుద్ధఏకాదశితో పూర్తియైనది. సాధారణముగా మాసాంతము శుద్ధ ఏకాదశితో పూర్తిగాక పూర్ణిమతో నగును. గనుక మనము చెప్పుకొనునది యైదురోజులు భేదముగా నున్నది. ఈవైషమ్య మవివక్షితమని మల్లినాథుడే చెప్పియున్నాడుఁకదా. కావున శాపాంతము సరిగనే చెప్పబడినదని చెప్పుకొనవచ్చును. కావున నేవిధమగు భేదమును లేదనియే చెప్పవచ్చును. మల్లినాథుఁడు మాసాంతము పూర్ణిమతో నగుటను కనిపెట్టలేకపోయెనని చెప్పుకొనవలసియున్నది. అంతియకాని కాళిదాసు గ్రంథములో కాలభేదము వచ్చుచున్నదని చెప్పుకొన నవసరము లేదు. అమాంతమాసాంతమువలనఁగాని పూర్ణిమాంతమాసాంతము వలనఁగాని మనము వేచియుండనవసరము లేదు. యక్షశాపాంత మెప్పుడైనదో తెలుసుకొనిన జాలును. అది కార్తీకశుద్ధఏకాదశినాఁడే యైనదని స్పష్టముగా గ్రంథమునందు చెప్పఁబడినది. కావున నదియే చూచుకొనవలెను. అలమతివిస్తరేణ. 'ఆషాఢస్య ప్రథమదివసే' యనుపాఠ మవసరము లేదు. 'ప్రశమదివసే' యనునది తప్పుగాదు.

వ్యాకరణశాస్త్ర ప్రశంస.

మల్లాది సత్యనారాయణశాస్త్రిగారు నూజివీడు.

మఱియు గీర్వాణభాష వాఙ్మయావస్థను బొందకమునుపే యాభాషకుఁ బండితులు సంస్కారము చేసియుంది రనియు నది యట్లు కానిచో నాదికాలము నుండుఁగూడ నాభాషకు సంస్కృతభాషయను పేరెట్లు వచ్చు ననియు నాసంస్కారము గూడ బ్రాకృతాదిభాషాపదములకుఁ గొన్నింటికిఁ జేసి రనియుఁ గొందఱు చెప్పుచున్నారు. ఆవిషయము లాలోచింపఁదగినవి.

భాష వాఙ్మయావస్థను బొందకమునుపు కట్టుపాట్లు వ్రాయుట యెట్లు సాధ్యమగునని తలదికో తెలియకున్నది. ఏమన వ్యాకరణశాస్త్రము భాషపైనను, భాషయుచ్చారణము పైన నుచ్చారణము ప్రాణిపైనను, నాధారపడియున్నవి. ఆప్రాణులు వ్యక్తావ్యక్తధ్వనికర్తలని రెండు తెగలు. అందువ్యక్తధ్వనికర్తలే ప్రస్తుతకార్యోచితులుగాన వారిలోఁ గూడఁ బ్రస్ఫుటస్థితోచ్చారణకర్తల యుచ్చారణములే యీవ్యాకరణములకు మూలములు. అట్టితఱి నాశాస్త్రమును వాదులు చెప్పినప్రకారము చేయుటకుఁ బ్రస్ఫుటస్థితోచ్చారణకర్తలలో విమర్శకులందఱొకచోట నుండనవసరము లేనిచో వారు కూడఁ బలుకుకొని వ్రాయసమకట్టుట యెట్లు సాధ్యమగును? అందఱొప్పుకొని యాచరణములో నుంచినం గాని యదియంతట వ్యాపకమగుట యెట్లు? ఒకరు చెప్పినంతమాత్రమున నందఱామోదించి తెలిసికొనుట, యనుసరించుట సంభవించునా? కనుక వాదిమతమున నాప్రథమవ్యాకర్తలందఱొకచోటనుండి రనక తప్పదు. కాని వారందఱొకచోటనే యుండశక్యమా? అట్లున్నను వారు పరస్పర మతావలంబకులుగాఁ గాని యేకవిధాభిప్రాయకులుగాఁగాని తప్పక యుందు రని నిర్ధారణయుండునా? అట్లుండుట సహజమా? అయి

నను భాషాచార్యులెందఱుందురు? అట్లున్నప్పుడు శాస్త్రాంతరాది రచయితలు తమశాస్త్రములలో నీనవీన శాబ్దికుల శబ్దానుశాసనముల నెట్లామోదించి యనుసరించుట సంభవించును? సమస్తశాస్త్రాదుల కంటె నీవ్యాకరణశాస్త్రమే ముందు పుట్టినదని నిర్ధారణ యెట్లు చేయ నగును? శాస్త్రాదికర్తలందఱు భాషను సంస్కరించి తమగ్రంథములలో వ్రాయుటయే నిర్ధారణ యనినచో భాషవాఙ్మయావస్థను బొందకమును పు భాషలో వ్యాకరణమునకు నాధారమైన వాక్య, పద, పదావయవ, ప్రత్యయాది, జ్ఞానము మొదట వారి కెట్లు కలుగు నని తలంచిరి? ఏవా క్యసముదాయమో యెవని నోటినుండియో యేకదండాకారముగ బయ లు వెడలినపిమ్మట దానినే శుశ్రూషాపూర్వకముగ నభ్యసించిన తరువా తివారు విమర్శకులైనచో వాటికి దానియందు గ్రహింపదగిన యర్థమె ట్లువచ్చుచున్నదో యను జిజ్ఞాస కలుగుట, విభజనము చేయఁబూనుట మొదలగునవి సంభవించునుగాని ముందుగనే, యనఁగా భాష వాఙ్మయా వస్థను బొందకమునుపే యాపని యెట్లు సంభవించును? ఆ దండాకార వాక్యసముదయమే యాకాలమున నాభాషకు వాఙ్మయావస్థయను నా మతమున వాఙ్మయావస్థకుఁ బూర్వము వ్యాకరణరచనాభావము సాధ్య మగుచున్నది. వాదిమతమున వాఙ్మయావస్థకుఁ పూర్వము వ్యాకరణ జ్ఞానము కలుగుటకు నాధార మేది? అనఁగా వాక్యపదాదులుకూర్పఁ బడినప్పుడే వాని నాధారముచేసికొని యంకురించెడి వ్యాకరణమునకు నావాక్య పదాదులు లోకచోఁ గూర్పఁబడకపోయినచో నాధారము లేక రచనాప్రవృత్తియే యసంభవమగు నని తాత్పర్యము, కనుక భాష వాఙ్మ యావస్థను బొందకమునుపు భాషకు వ్యాకరణము చేసిరనుట సంగత ముకాదు. పతంజలి భగవానుని "వేదా న్నో వైదికా స్సిద్ధా" యను వ్యాకరణశాస్త్ర ప్రత్యాఖ్యాన ప్రశ్నపరగ్రంథమునందలి "వేదాత్" అను పదమువలన వైదికభాష వ్యాకరణోత్పత్తికిఁబూర్వము వాఙ్మయావస్థను బొందిన ట్లగపడుట లేదా?

మఱియు, వ్యాకరణశాస్త్రోత్పత్తికిఁ దరువాతివారు సంస్కరణ పద్ధతిఁ దెలిసి భాషను సంస్కరించి తమతమ శాస్త్రాదికములలో వ్రాసి యుండు రనిన నందురుగాక. ప్రాచీనులును, విప్రకృష్టదేశస్థులగు సమకాలికులును వాఙ్మయ రచయిత లయినచో వారు క్రొత్తగావచ్చిన యీశాబ్దికుల శబ్దానుశాసనము నె ట్లనుగమింపఁగలుగుదురు? అట్లనుగమింపక వారు తమ గ్రంథములలో నప్పటివ్యాకరణమునకు విరుద్ధప్రయోగము లేవియైన, ననఁగా నప్పటి వైయాకరణులకు సంభవింపఁగూడనివియు నప్పటి యవైయాకరణులకు సంభవింపఁదగినవియుఁ, బ్రయోగించియున్నారా? అట్లన్నచో వారు క్రొత్తగావచ్చిన శబ్దానుశాసనము నెఱుఁగ రనిచెప్పవీలగును గాని యాప్రయోగములు వాఙ్మయావస్థాప్రారంభ కాలమునాఁటివియు, లేక వాఙ్మయావస్థాబాల్యకాలమునాఁటివియు నుత్పత్స్యమాన వ్యాకరణములకు మూలములునుగావ నందు నివి వ్యాకరణ విరుద్ధమనియు, నిది యనుకూలమనియు, నేర్పఱుప నెట్లు శక్యమగును.? మఱియు వైదికభాషానుశాసనమువలనఁ బ్రయోజనము దాని యర్థాదినిమిత్తముగ జ్ఞప్తియుంచుకొనఁదగిన యంశములందుఁ బొరపాటులు రాకుండఁ జేసికొనుటయే గాని యందలి ప్రయోగముల దుష్టతాదుష్టతలను నిరూపించుట గాదనిన నాయభిప్రాయము సర్వసమ్మతమైనచో ఋషులవాక్యములకు ననుశాసన మవసరముగాదు. కనుకనే

"లౌకికానాం హి సాధూనా మర్థం వా గనువర్తతే-
ఋషీణాం పున రాద్యానాం వాచ మర్థోనుధావతి."

యని భవభూతిమహాకవి ఋషుల యాధిక్యము నంతగఁ బొగడియున్నాఁడు. త్రిమునివ్యాకరణముకంటెఁ బ్రసిద్ధమై, వ్యాపకమైన మఱియొక వ్యాకరణము, మునిత్రయమునకుఁ బూర్వముగాని పరమునఁగానియున్నదని కని విని యెఱుఁగుదురా? అట్టితఱి వారిలోఁ బరమ ప్రామాణికుడైన పతంజలి మహర్షి "వేదా న్నో వైదికాస్సిద్ధా" యను వాక్య

తాత్పర్యమునకును భాష వార్ధియావస్థను బొందకమునుపు కట్టుపాట్లు చేసి రఘునాథనాతఃవిమర్శకుల వాక్యతాత్పర్యమునకును విరోధము రాకమానదు లేదు. అట్లైనచో నేది గ్రాహ్యమో యేది త్యాజ్యమో యావాద ప్రధానులే నిర్ణయింపఁదగుదురు. కనుక భాష వార్ధియావస్థను బొందక మునుపు భాషకు కావలసిన కట్టుపాట్లు చేసి యుంచుటకు నేకాలమున నట్టివారికి శక్యముకాదు గాన నట్టివ్రాత పొరపాటున వచ్చిన దని నాయభిప్రాయము.

ఇఁక గీర్వాణభాషకు సంస్కృతభాష యని యెట్లు వ్యవహారము గలిగినదో విచారింపఁదగినది.

సంస్కృతమను పదమును బాగుచేయఁబడిన యేవస్తువునైనను అనఁగాఁ జెరుగుట, జల్లించుట, యెగురఁబోయుట, వడియఁబోయుట, యెండఁబెట్టుట మొదలగు నేకపనిచేసినవస్తువునైనను-జెప్పునపుడు వాడుచుండుట యలవాటు. ఆవిధముగనే వ్యాకరణసూత్రము లోక యభిప్రాయమునే బోధించు వ్యస్తపదముల సంఘటనాసాధుత్వమునుగాని యొక పదముపై వచ్చెడి ప్రత్యయములకు నాశబ్దార్థముతో సరసాధుత్వనిర్ణయమునుగాని బోధించును. ఉదాహరణము వ్యస్తమందుఁ జూపుచున్నాను. "దధ్నా సంస్కృతం వ్యంజనమ్" దధిచే సంస్కృతము వ్యంజనము. "భ్రాష్ట్రే సంస్కృతా మాషాః" భ్రాష్ట్రమందు సంస్కృతములు మాషములు. ఇందలి మొదటిదానికిఁ "పెఱుగుతోఁ గూర్పఁబడిన వ్యంజనము (పచ్చడి)" అని యర్థము. రెండవదానికి "మంగలమందు వేఁపఁబడిన మాషములు" అని యర్థము. ఈరెం డుదాహరణములలోను సంస్కృతమను పదము గలదు. కాని యారెండుచోట్లను జరుపఁబడిన సంస్కారములు రెండువిధము లైనవి గాని యొకవిధముగాదు. కనుక సంస్కృతమనుపదమునకు భిన్నకారణక సంస్కారము చేయఁబడినవస్తువు మొదలైనది యర్థముగాన సంస్కారములు వేలువేలు విధము లని తేలుచున్నది అవసరము లేకపోయినను ప్రత్యయాంత పదముల నుదాహరించుచు

న్నాను. "దాధికంవ్యంజనమ్" దాధిక వ్యంజనము. "భ్రాష్ట్రామూషాః" భ్రాష్ట్రములు మూషములు. అర్థములు మనుకటి యట్లే. ఇట్లే యనేకములు చెప్పవచ్చును. కనుక సంస్కృత మనుపదము భాషకే విశేషణముగా నుండి తీరవలెనని నిర్బంధము లేదు. కర్త్రర్థప్రత్యయాంతమైన యా సంస్కృతమనుపదము భాషకు విశేషణ మైనచో విశేషాంశ మేదో యచటఁ గలిగినదను నర్థము మాత్రము తప్పకాదు. కాని వాదుల యుద్దేశ్యము మాత్రము భాషలోని ప్రయోగము లొకలాగున నుండఁగఁ బండితులు వానిని దమ కనువగు మఱియొకలాగున మార్చి యిదియే శుద్ధశబ్దమని యామోదించి యనుసరించి రని యుండుటచేఁ దప్పనక తీరదు. అవని యెట్లుసాధ్య మగునని తలఁచిరో తెలియకున్నది. ప్రయోగ మొకతీరునను శాస్త్రవిధి మఱియొక తీరుననుండి యున్నచో నాశాస్త్రముతో నేకాలమందుఁగాని పనిగలవా రుందురా? "ఉపేయప్రతిపత్త్యర్థముపాయా అవ్యవస్థితా" అనున్యాయము చొప్పునఁ బ్రాళికలోనే కొంచమైన భేద ముండినను, బ్రధానోద్దేశము తలక్రిందులుగా నుండఁగూడదు గనుకఁ బైన వర్ణింపఁబడిన దండాకార వాక్యసముదయము నాధారముగఁ జేసికొని వైయాకరణులు కొందఱు జ్ఞాపకముగా నుంచుటకై వైదిక ప్రయోగ సాధుతాపరశాసనములను, కొందఱు లౌకిక ప్రయోగ సాధుతాపరశాసనములను, కొందఱుభయములను భిన్నభిన్నానుపూర్వక ప్రత్యయాది విధులతోఁ జేయ నారంభించియుండిరి. అందుఁ బాణిన్యాది మహర్షులు మువ్వురు సంపూర్ణముగ వైదిక లౌకిక ప్రయోగ సాధుతాపరశాసనముల ననన్యాదృశ రచనా నైపుణిగ రచించి యుండిరనుట విశ్వజనీనము. కాని "ఇకో యణచి" యను మొదలగు విధులఁజూచి యావిధానమే యాయారూపసిద్ధికి మూల మని, యది యాభాషలో లేని క్రొత్త పద్ధతియని యనుకొనఁదగదు. భాష ధ్వని రూపముతోఁ బ్రారంభించినదిమొదలు భాషలోనే యున్న విషయములను జ్ఞాపనార్థమైన వ్యాకరణములో నొకానొక సౌకర్య మపే

షించి యెక్కడే క్రొత్తగాఁ జెప్పిపెట్టినట్లు విధించుటయే కాని యచటి కొకటియు రానులేదు మఱొకటి పోనులేదు. అట్లైనచో వారి ప్రధానోద్దేశ్యమగు నీఖండస్ఫోటవాదిత్వమునకు భంగము వాటిల్లదా? వారు భిన్నభిన్నానుపూర్వక ప్రత్యయాదులను విధించుటచే వారొకరితో నొకరు కలసి మాట్లాడుకొని వ్రాయలేదనియు, భిన్నభిన్నదేశస్థులనియు, వారి వ్యవహారములో నాభాష యెట్లున్నదో యాస్థితికి భంగము జరుగకుండ నిబంధనము చేసిరనియుఁ దెలియుచున్నది. కాని సంస్కృతమను పదము భాషకు విశేషణమైనయెడలఁ జెప్పఁదగిన యర్థ మేమి? యది యెట్లు సంగత మగునని యడిగిరచో వినుఁడి.

జనవృద్ధితోఁబాటు వ్యవహారమునకుఁ జాలినంత శబ్దజాలము కూడఁ బెరిగినపిమ్మట నాశబ్దజాలగ్రథిత ప్రాచీనవాక్యములను దఱువాతివారిలో నందఱుఁగాకపోయిన శ్రద్ధాళువులైన కొందఱు క్రమముగా విడువకుండ నభ్యసించుట యాచారము. అది యిప్పటికి దేశభాషలలోఁ గూడఁగలదు. అట్లభ్యసించిన ప్రాచీనవాక్యసముదయము నెవరికొఱకైన నర్థాదిబోధనోద్దేశ్యమున నుదాహరించుట యసంభవము గాదు. అట్టివారిలో విమర్శకులుండి యీవాక్యమున కాయర్థ మెట్లు వచ్చుచున్నది? వాక్యార్థముల రెంటికి సంబంధ మేమి? యను మొదలగు జిజ్ఞాస లుదయించి యీవాక్యసముదయమును సామర్థ్యానుసారముగ విభాగింపకపోరు. విభజించిన భాగములలోని విభేదమును గ్రమముగ గుర్తుపట్టక మానరు. గుర్తించిన విషయములను జ్ఞాపనము కొఱకు విషయభేదమును బట్టి వేఱువేఱు సూత్రములయందు గ్రుచ్చకుండురా? ఈపని మొదటఁ దత్తాత్కాలోపయుక్తముగా నారబ్ధమైనను విషయబాహుళ్యమునుబట్టి శాస్త్రరచనయే యగును. ఇట్లు ప్రత్యేకముగా నాసక్తిగలిగి యభ్యసించిన ప్రాచీనవాక్యములకును, సాధారణ జనశ్రవణమాత్రాధార వ్యవహార వాక్యములకు, నుచ్చారణములో భేదము కలుగుచునే యుండును. అట్టి వ్యవహారమాత్రశరణ్య భాషావేదు లధిక

సంఖ్యాకులుగాను, శిక్షిత ప్రాచీన వ్యవహారవాక్య లల్పసంఖ్యాకులుగాను నుందురు గనుకను, సాధారణవ్యవహార మందఱకుఁ గావలసియే యుండును గనుక నధికసంఖ్యాకుల వ్యవహారవాక్యము లనల్పసంఖ్యాకులు నేర్చియేయుందురు. అల్పసంఖ్యాకు లభ్యసించిన ప్రాచీన వ్యవహారవాక్యముల నధికసంఖ్యాకులు వ్యవహారములో లేనివి కాన నభ్యసింపరు. అల్పసంఖ్యాకు లభ్యసించిన ప్రాచీనవ్యవహారవాక్యములు మొదటఁ గొంతకాలము వఱకు నధికసంఖ్యాకులకుఁ దెలిసినను గాలము గడచిన కొలఁదిఁ దెలియనేరవు. అట్లగుటచే శిక్షితాశిక్షితుల భాషలుచ్చారణభేదమును బురస్కరించుకొని ప్రాచీనార్వాచీనతా భేదము నందుచుండును. అట్టి ప్రాచీన భాషాభేదమునఁగూడ వ్యవహారబలమున మొదట లేకపోయినఁ గ్రమముగాఁ గొన్నిపదములలో నక్షర లోపాదులుకలిగి మార్పుప్రారంభించును. క్రమముగ నది యంతట నలముకొని ప్రాచీన వ్యవహార వాక్యపద్ధతి వేఱుగను నవీనవ్యవహార వాక్యపద్ధతి వేఱుగను జేయుచుండును. ఆప్రాచీనవ్యవహారవాక్యపద్ధతి గలదియే వైదికభాష; యానవీనవ్యవహారవాక్యపద్ధతి గలదియే గీర్వాణభాష; యాయశిక్షిత వ్యవహార వాక్యపద్ధతి గలదియే ప్రాకృతాదిభాష యని యాది దంపతి కుటుంబోద్భూత ధ్వనియాదవ్యవహార సాధనము క్రమముగా మూఁడు భాష లగుచున్నది. కనుకనే యెంత నేర్పుతో వ్రాయఁబూనినఁ గొన్నిస్థలముల సాంకర్యము రాకమానదు. ఇదియే కారణముగఁ బ్రాకృతాదిభాషలలోఁ గనంబడు ప్రయోగవిశేషములు, వైదికభాషయందుఁగూడఁ గనఁబడుట సంభవించుచున్నవి. ఈ భాషావిభాగము మొదట తెలియఁబడకపోయిన నప్పటప్పటి భాషాపరిస్థితులను గాపాడ బయలువెడలిన విమర్శకులవలన బయలుపడుచుండెను. అట్టి వైయాకరణులు ప్రాచీనార్వాచీనాశిక్షిత జనవ్యవహారఫలిత త్రివిధ భాషారాశికి వ్యాకరణ మను చాలనిని గనిపెట్టి జ్ఞాపనార్థమైన సంస్కార మనుభ్రమణ క్రియను గల్పించి ఘనాఘనున పేలవత్వ ధర్మముల మూఁటిటిని గనుఁగొ

నఁగలిగిరి. అనఁగా నప్పటికిఁ గొంచెము కొంచెము గలిసి మెలిసి యున్న పైమూఁడు భాషలలోని పదములను వేఱు వేఱు రాసులుగఁజేసి రనియే కాని ప్రాకృతాది భాషాపదములకు సంస్కారము (క్రొత్తమార్పు) కల్పించి సంస్కృతభాష యనలే దని తాత్పర్యము. ఇట్లు సంస్కార మిట్టిదని నిర్ణయించుటచేత, సంస్కృత మనుఁపదము విశేషణ విశేష్యభావమంది నప్పుడు చెప్పఁదగిన యర్థము చెప్పి యిదియే గీర్వాణభాషకు సంస్కృ భాషయని పేరువచ్చుటకు నిరుష్టసమాధానమని కృతకృత్యత నందుచు న్నాఁడను. ప్రాకృతభాషాదిపదములకుఁ గ్రొత్తగా సంస్కారముచేసి యా సేతుహిమాలయపర్యంతము ననాదినుండి ప్రసిద్ధికెక్కిన వ్యాకరణేతర సమస్తశాస్త్రాది కర్తల నందఱ నొక్కసారి యావైపుఁ ద్రిప్పఁగలిగిన కృత్త్రిమవ్యాకర్త లీభారతావనియం దుండిరని మీకు విశ్వాసమున్నచో మీకొకనమస్కారము. అట్టాక్రొత్తసంస్కార మెన్నఁడైన భాషలోనికిఁ జొరునా ? యని నాసందేహము. "నియమార్థం వ్యాకరణమ్" అను పతంజలిమహర్షి వాక్యమునకు నాభాష యెప్పు డేపద్ధతిలో నున్నదో, యాపద్ధతినుండి తప్పింపక కాపాడ నవసర మని తాత్పర్యము గాని క్రొ త్తక్రొత్తవ్యాకరణము వ్రాసికొని మఱలమఱల సంస్కారముచేయ మని కాదు. అట్లుచేయుట నియమ మని చెప్పఁబడదు. భాషోత్పత్తి ప్రజాసం ఘమునుండియే కాని వైయాకరణులనుండి కాదు. అందుచేతనియే పతం జలిమహర్షి కుమ్మరివానిని గుండలుచేయు మనినట్లు వైయాకరణుని శబ్ద ములు చేయుమని యెవరును బలుకరని వేనోళ్ల నుద్ఘోషించుచున్నాఁ డు. భాషలో సూక్ష్మముగా నున్న యనుగమకసూత్రమే వ్యాకరణ మనియు నదిగీర్వాణభాషను సంస్కృతించుటకు మూల మనియు విన్న వించుచున్నాను. కనుక సంస్కృత మనుపదముకూడ వైయాకరణసృష్ట ముగా దని తెలిసికొందురు గాక. ఈయభిప్రాయము పతంజలిభగవానుని "లోకాచ్చ లౌకికా"యను ప్రమాణవచనమువలనఁ దెలియుచున్నది.

తిక్కనకవిబ్రహ్మ.

ఉ. పంచమవేదమై పరగువ్యాసుని భారతమాంధ్రమందు ని
ర్వంచితకీర్తివైభవ విరాజితులైన కవిత్రయంబు వా
రంచితరీతివ్రాసి జగమంతకునిల్పిరి తెన్గుభాషలో
మించినయాదికావ్యమిది మేలొసఁగుఁగద యాంధ్రభూమికిన్. ౧

ఉ. నన్నయభట్టముఖ్యకవినాథులు ముగ్గురు భారతంబు మే
లెన్నికఁగన్నరీతి రచియించిరి పెట్టిరిభిక్ష తెన్గుకై
తన్నెటివ్రాయువారలకుఁ దత్కృతియాదికి నాదియాట
చేరెన్నికఁగన్న సత్కవులకేనియుమార్గము చూపఁగల్గెడిన్. ౨

ఉ. పూర్వకవీంద్రులన్న రసపూర్ణదొలుకాడెడు రీతిఁగూర్చియే
పర్వముజూచినన్ హృదయపర్వముగా గనుపింపవ్రాయరే!
సర్వమెఱుంగువారలకు సర్వపదార్థము గోచరించు నీ
యుర్వరనాంధ్రజాతి కిది యొక్కటిచాలదె? గర్వమందగన్. 3

ఉ. ఎన్నరొయి సత్కవీశ్వరులు నేర్పునవ్రాయరె? యందులోనఁ ది
క్కన్నకవిత్వమెంతయు మహామహిమంబున రాజిలుఁగదా
తిన్నగదానితత్వమును దేటపడన్ గ్రహియింపఁగల్గు వా
రెన్నఁగ నొక్కరుందురు మహీస్థలి సత్కవికోటిలోపలన్. ౪

క. అందు విరాటోద్యోగము
లందున్‌గల కవితయిట్టిదంచువశంబా
పొందుగఁ జెప్పఁదలంచిన
డెందము పలరించుఁగాదె? దృఢీకృతమహిమన్. ౫

ఉ. తిక్కన సోమయాజికవిధీరుని తేటతెనుంగుకైతలోఁ
జక్కనినేర్పుకూర్పును రసజ్ఞులుమెచ్చెడి వాక్చమత్కృతుల్
మక్కువమీరుభావములు మాటికిమాటికిఁ గానుపించు న
వ్యక్కృతితోడఁజూడు కవులందరకున్ బ్రతిపద్యమందునన్. ౬

ఉ. ఇంతియగాదు తిక్కనకవీంద్రుని తెన్గు కవిత్వధోరణుల్
జింతనఁ జేసియున్ దెలియలేఁ రహస్యము సత్త్వపీఠ లో
క్కింతమహత్త్వ మెట్టులొ గ్రహింపఁగనయ్యెనటంచుఁ జెప్పఁగా
నెంతపరిశ్రమించి కవియించెడిగ్రంథము చెప్పనేటికిన్. ౭

క. లౌకిక వైదిక ధర్మ
ప్రాకట్యం బెల్ల నెఱుఁగు భవ్యగుణుండై
శ్రీకవియగుటన్ దిక్కన
శ్రీకరముగ రచనఁ జేసి చేకొనె యశమున్. ౮

చ. తలఁచినయంతమాత్రన సుధామధురాంచిత వాక్యసంపదల్
నిలచుఁ దమంతఁ దామె రమణీయముగాఁగ రసప్రతీతిగాఁ
దెలుఁగుకవిత్వ ధోరణులు తిక్కనకావ్యమునందుఁ గన్పడన్
దెలుఁగు రచించువారలకు తిక్కనదైవమనంగఁ జెల్లదే ? ౯

క. ఆపావన మావాచా
నైపుణ్యం బామనోజ్ఞనయమార్గవిధం
బా పాత్రౌచిత్యగుణ
శ్రీపాటవ మెంచ సుకృతసిద్ధము సుమ్మా ! ౧౦

ఉ. మూగురుసాటివత్తురు త్రిమూర్తులకన్నిటఁ గావ్యసృష్టిలో
మూగురకున్ సమానమగుమూర్తి కనంబడ దావిరాటము
ద్యోగములందుఁ దిక్కనమహోన్నతభావవిశేష శేముషీ
శ్రీగరిమం బనన్యకవిశేఖర లభ్యమనంగనొప్పదే ! ౧౧

క. తిక్కనహృదయ మెవారలు
జక్కఁగ నేర్వంగలేరు సముచితపదముల్
జక్కని తేట తెనుంగున
నక్కజముగఁ గూర్పఁగల మహాకవియగుటన్. ౧౨

ఉ. భారతమన్న సత్త్వపులపాలిఁట కన్నివిధంబులెంచఁగా
మేరువురీతి భాసిలుచు మేలొనఁగూర్చువిధాన మందులో
ధీరుడు సోమయాజికవిధీవరు భాగము తెన్గుకైతకున్
దారినిఁ జూపుచుండెఁ గవినాథులకయ్యది గోచరించెడిన్. ౧౩

క. తినినన్ గారెలె తినవలె
వినినన్ భారతమునొండె వినవలె ననుచున్
మనసార వీను లలరఁగ
వినమో? లోకోక్తినెపుడు పెద్దలు సెప్పన్. ౧౪

ఉ. తిక్కనయర్థగౌరవము తిక్కనభావ మెఱుంగుటన్న చోఁ
దిక్కనయంతవారలయి తేజరిలన్ వలె భావకుండునన్
జక్కని శాంతిదాంతిగుణసంపదలందునఁ గానినాఁడు మా
తిక్కనభారతంబు కడుతిక్కఁగనుండుటఁ జిత్రమేటికిన్. ౧౫

ఉ. లోకమునందు భారతముతో సరితూగెడు గ్రంథరాజ మీ
లోకమునందు లేదు కవిలోకము దీనిమహత్వతత్వమున్
బ్రాకటపుణ్యగౌరవము భావసదృష్టియు భావపుష్టి న
స్తోకమహత్వమున్ దనివితోఁ బఠియించి తరింపవేడెదన్. ౧౬

వి. రామసుబ్బారాయుఁడు,
స్నేహలతాకవితాసంఘము.
కొల్లాపురం.

తిక్కన యర్జునపాత్రమును బోషించినవిధము.

శ్రీమత్తిరుమల పెద్దింటి రాఘవాచార్యులుగారు—కాకినాడ.

కవులు తమ గ్రంథములయం దుదాహరించు సమానబలపరాక్రమాదులు గల పాత్రములను వర్ణించునపుడు వారిలో నొకపాత్రమునం దభిమానము జూపుచు వర్ణించుట సంప్రదాయమై యున్నది. ఇట్టి సంప్రదాయమును సంస్కృతకవులు పాటించిన పద్ధానికి మెఱుంగువెట్టుట యాంధ్రీకరణకవులకు నాచారమగుచుండెడిని.

శ్రీమద్రామాయణమున సీతాపహరణము వంశనాశనము, హేయము, నరకహేతువు, నను మొదలగు విషయములను సూచించువాక్యములను రావణునితో విభీషణకుంభకర్ణులు సమానప్రవృత్తిగలవారై పలికిరి. కాని, కుంభకర్ణునియం దొకవిధమగు నిరభిమానము, విభీషణునియం దొకవిధమగునభిమానము లోకులకు గల్గుచున్నది. ఇట్లు కల్గుటకుఁ గవులువ్రాసెడి యభిమానసూచకములగు వ్రాతలే కారణములని యూహింపనగును.

భారతమునఁ గర్ణార్జునుల యుభయులలోఁ గర్ణుఁడే బలపరాక్రమాది గుణసంపత్తి కలవాఁ డని విమర్శనాదృష్టితోఁ జూచువారికి గోచరించును. అయినను సామాన్యులు కర్ణుఁడు వీరుఁడు కాఁ డనియు నర్జునుఁడే మహావీరుఁ డనియు ననుకొనుచుందురు. అట్లనుకొనుటకుఁ గూడఁ గారణములు కవి యాయాఘట్టముల నర్జునబలపరాక్రమముల నతిశయోక్తులలో వర్ణించుట, కర్ణునిబలపరాక్రమముల నీరసముగా వర్ణించుట యని యెన్నవలసి యున్నది.

“తల్లిచెవులు తెగిన పుత్త్రుఁడు పినతల్లిచెవులు తెంపుకొనునా” అనునట్లు సమానవీరు లగుకర్ణార్జునులను వర్ణించునపుడే సకచ్ఛి ప్రేమమును జూపినకవి యుత్తరార్జునులకు సంగ్రామసంబంధము కలిగినపు డుత్తరునినీచముగా వర్ణింపఁ దనుటకు హేతువు లేదుకదా!

ఉత్తరదిశ నున్న తనగోగణమును దుర్యోధనాదులు ముట్టడించి రనునుడి విని వెక్కటి యగునుత్తరుఁడు బృహన్నలసారథియై విజయా

థము బయలువెడలి నూతనజలధరశ్యామప్రదేశము లాఁకబోఁకముల ననుకరించుచు సంధ్యారాగసదృశచ్ఛాయాదేశంబులు పల్లవప్రతతిని బరిహసించుచు రాజహంసగౌరంబు లగుకట్టులు పూఁబోదలచందమునఁ బ్రకాశించుచు, హరిద్రరుచిసమానాకారస్థానములు పుష్పాకులట్లు మెఱయుచుఁ గలసి మెగయుసేనాపరాగము శృంగారవన మొకటి దివికి నరిగాఁపుపోవుచున్నదా యనునట్లుండ గోవులను మరలించుకొని పోవుచున్న కౌరవరాజుసైన్యమును జూచి భయపడి గరుపారినమేనును, దలఁకుమనము, బిచ్చవడినచూపును నై తొట్రుకడి బృహన్నలతో నీక్రింది విధముగఁ బిఱికితనమును వివరించువాక్యముల వచించె నని చెప్పఁబడినది.

శా. భీష్మద్రోణకృపాదిధన్వికరాభీలంబు దుర్యోధన
గ్రీష్మాదిత్యకటుప్రతాపవిసరాకీర్ణంబు శస్త్రాస్త్రజా
లోష్మస్ఫారచతుర్విధోజ్జ్వలబలాత్యుగ్రం బుదగ్రధ్వజా
ర్చిష్మత్త్వాకలితంబు సైన్య మిది యేఁ జేరంగ శక్తుండనే.

క. అకృతాస్త్రుఁడ బాలుఁడఁ గా
ర్ముకవిద్యాప్రౌఢిమై నిరూఢు లయిన యీ
శకునిజయద్రథదుర్ముఖ
వికర్ణకర్ణాదియోధవీరుల కెదురే.

పరికించి చూడఁగా నుత్తరువంశము పరాక్రమవంశ మని యీ క్రిందిపద్యములవలనఁ దేటపడుచున్నది.

శా. లోకస్తుత్యవిభూతి నన్యకృతనాలుంటాక బాహాబల
శ్రీకల్మిన్ రథదంతిఘోటకభట శ్రేణీసముద్దాంతసే
నాకల్పధ్వజవిభ్రమంబున సుహృద్యప్రోద్యముండై శతా
నీకుం డుద్ధతి నేఁకుదెంచె నఖిలానీకంబు నుప్పొంగఁగన్.

ఉ. ఆతని తమ్ముఁ డైనమదిరాశ్వుఁడు కర్ణఝుళంఝుళానము
ద్ధూతబలోత్థరేణుపటిధూసరితాంబర మైనవారణ
వ్రాతము గొల్పి రాఁ గడఁగి వచ్చె సముజ్జ్వలహేమవర్మ ని
ర్యాతరుచిచ్ఛటాపటలరంజితహేతిమహోగ్రసైన్యుఁ డై.

తే. అతనియనుజుండు సూర్యదత్తాహ్వయుండు
సమరసైనిక నానాస్త్ర శస్త్రబహుళ
దీప్తిజాలకప్రతిహత దినకరాంశు
రాజి యై చనుదెంచె సంరంభ మెసఁగ.

ఉ. తెల్లనిజోడు వెట్టుకొని తీవ్రగతిం జనుదెంచె మత్స్యభూ
వల్లభునగ్రనందనుఁడు వైరిమదాపహవిక్రమప్రకా
రోల్లసితుండు వన్యబల ముద్ధతిఁ గొల్చుమృగేంద్రరేఖ శో
భిల్లుచునుండ శంఖుఁడు విభీషణశంఖనినాద మొప్పఁగన్.

ఈపద్యవిషయములనుబట్టి శతానీకమదిరాశ్వసూర్యదత్తు లను విరటునిసోదరులుఁ విరటునిప్రథమపుత్త్రుఁ డగుశంఖుఁడు బహుపరాక్రమాతిశయము కలవారనియు దక్షిణగోగ్రహణవిజయమునకై విరటునికి సహాయపడుచుండి రనియుఁ దెలియవచ్చెడిని. ఇట్టిపరాక్రమవంతులు కల రాజవంశమునఁ బుట్టినయుత్తరుఁడు కూడ నొకవీరుఁ డని గ్రహింపవలసియున్నది. సింహ మజమును గనుట లోకవిరుద్ధముకదా!

మఱియు గోపాధ్యక్షుఁడు దుర్యోధనబలశరాపారబాధితుఁడై కౌరవబలమును జయింపనేరక రథికుఁడై కురుబలజయశీలుఁ డుత్తరుఁడే యని గ్రహించి యతని సమీపించి గోవర్గము కురుసైన్యంబులచే ముట్టడింపఁబడిన స్థితివివరించి, యీక్రిందివిధమునఁ బల్కెను.

ఆ. తేరుఁ బూన్పఁబంపు తెప్పింపు దృఢతను
త్రాణ ముగ్రచాపబాణపూర్ణ
తూణఘనగదాసి తోమరచక్రాను
లనువుగానొనర్పు మతిరయమున.

చ. విరటుఁడు నిన్ను నెప్డుఁ బదివేవురముందటఁ జెప్పు బాహువి
స్ఫురితుఁడు శౌర్యశాలి కులభూతివిశేషవిధాయకుండు భూ
భరణవిశారదుండు జవభవ్యతకఃఫలసంభవుండు గా
తరపరిరక్షకుం డనుచు దానికి నీకుగఁ జేయు మిత్తఱిన్.

విరటునివంటివీరుఁడు పదుగురలోఁ దనకుమారుని బ్రశంసించుట స్వాభావిక మనియు నిందతిశయోక్తి లే దనియు గ్రహింపవలయును.

తనయనంతరము రాజు కానున్న యనవుడు దగు నుత్తరు నిట్లు ప్రశంసింపనిచో జనులు తనపుత్రునకు విధేయులు కానోవరను నూహతో ననెనని యనఁదగదు. తండ్రి యనంతరపుహక్కును సంపాదించుటకుఁ బ్రథమపుత్రుఁడు వీరుఁడు నగుశంఖుఁడే కలఁడు. ఆకారణమున నితని స్తుతింపనవసరము లేదు. కాన నితనిని తండ్రి ప్రశంసించుటంజేసి సత్యవిషయమును విశదీకరించుట యని గ్రహింపవలయును.

ఇదియుఁగాక సంస్కృతభారతమున దక్షిణగోగ్రహణయుద్ధమునకు సైన్యోపేతుఁడై పోవు విరటుఁడు పురరక్షణకై వీరుఁ డగును త్తరుని నాజ్ఞాపించె నని "త్వాం హి మత్తోన్య మహీపాలః శూన్యపాల మిహాకరోత్" అను శ్లోకభాగముచేఁ జెప్పఁబడి యున్నది. శూన్యపాల శబ్దమునకు విషమపదార్థవివరణటీకాకారులు శూన్యంవీరరహితం ఏక ఏవ పాలయ తీతి శూన్యపాలః అతిసమర్థత్వాత్ అని వ్యాఖ్య వ్రాసిరి. వీరుఁ డగును త్తరుని బురరక్షకునిగాఁ జేసె నని జెప్పువిషయమును దిక్కన తనభారతమున నాంధ్రీకరింపలే దని తెలియవచ్చెడిని.

మఱియు నుత్తరుఁడు గవాక్షస్థుఁడు వల్లినపల్కుల నాలించి తనకు సారథి లేఁ డనియుఁ దనసారథి తనకింతకుముందు సంభవించిన యిరువదియెనిమిది లేక యొకమాసము దినముల కాలపరిమితి గల యుద్ధమున మృతి నొందె నని యనుకొనినట్లు సంస్కృతభారతమునఁ గలదు.

శ్లో. అష్టావింశతిరాత్రం వా మాసం వా నూన మన్తతః
యత్త దాసీ న్మహ ద్యుద్ధం తత్ర మే సారథి ర్హతః.

దిక్కనమాత్రము తనభారతమున నుత్తరునికి జరిగినయుద్ధకాలపరిమితి నాంధ్రీకరించక యుత్తర బృహన్నలతో

క. ఇచ్చట నొకకయ్యంబునఁ
జచ్చెమదీయాగ్రజన్ముసారథి తగువాఁ
డెచ్చోట లేమి నాతం
డచ్చుపటువుఁ డయ్యె నీక్రియకు నొండొకర్తిన్,

అని బల్కినట్లు వర్ణించియున్నాఁడు.

కాలపరిమితి గమనించినఁ జనువరు లంతదీర్ఘకాలము యుద్ధము చేసిన వీరుఁ డర్జునునకంటె ఘనుఁ డనుకొందు రనియు నట్లైన నర్జున పాత్రపోషణము సరిపడ దనియుఁ దిక్కన గ్రహించి యావిషయము నాంధ్రీకరింపక పోవచ్చు నని తోఁచెడిని. కాని యిట్లాంధ్రీకరింపకున్నను దన వ్రాసిన "ఇచ్చట నొకకయ్యంబునఁ జచ్చె మదీయాగ్రజన్ముసారథి" అను పద్యమును బట్టియే యుత్తరుఁడు వీరుఁ డని విశద మగుచున్నది.

ఉత్తరునకు భూమింజయుఁ డను నామాంతరముకూడఁ గలదు. నామాంతరములు సార్థకములు కానోపునను పక్షము నంగీకరించిన నితఁడిదివరలో యుద్ధములుచేసి శత్రువుల జయించి భూముల వశపరచుకొనె ననియు నాకారణమున నితఁడు వీరుఁ డనియు విశద మగుచున్నది.

దక్షిణదిశావిజయము నొందివచ్చినవిరటునకు తనకుమారుఁడు సహాయహీనుఁడై యెక్కఁడే వెళ్లె నని విచారించినట్లు చెప్పఁబడియున్నది. కాని యతఁ డస్త్రశస్త్రాదివిద్యాపరాఙ్ముఖుఁ డని యెక్కడను వర్ణింపఁబడలేదు.

పై నుదాహరించినవానిచేఁ గాకుండ నీక్రింది వానివలనఁ గూడ నుత్తరుఁడు వీరుఁ డని తేటపడఁగలదు.

ధనూంషి చ మహార్హాణి బాణాంశ్చ రుచిరాన్ బహూన్
ఆదాయ ప్రయయే వీరః స బృహన్నలసారథిః.
ఏవ ముక్తస్తు సుశ్రోణ్యా తయా సఖ్యా పరంతపః
జగామ రాజపుత్త్రస్య సకాశ మమితౌజసః.
త ముత్తరం వీక్ష్య రథోత్తమే స్థితం
బృహన్నలాయా సహితం మహాభుజమ్
స్త్రియ శ్చ కన్యా శ్చ ద్విజా శ్చ సువ్రతాః
ప్రదక్షిణం చక్రు రథోచు రాంగనాః.
సరాజధాన్యా నిర్యాయ వైరాటి రకుతోభయః
ప్రయాహీ త్యబ్రవీ త్సూతం యత్ర తే కురవో గతాః
నాతిదూర మథో గత్వా మత్స్యపుత్త్రధనంజయౌ
అవేక్షేతా మమిత్రఘ్నౌ కురూణాం బలినాం బలమ్.

ఈశ్లోకములయం దుత్తరపదమునకు విశేషణపదములు వీరః అమితౌజసః మహాభుజః అకుతోభయః అమిత్రఘ్నః అని నిష్పాతిక ముగ వాడఁబడినవి. తిక్కనమాత్రము వీరః అనుపదమేగాక తక్కుంగల విశేషణములైనను నుత్తరపదమునకు వాడినట్లు కన్పట్టదు.

మఱియు నుత్తరుఁడు బృహన్నల యర్జునుఁడే యని గ్రహించిన పిమ్మట నతఁడు మాతలి దేవేంద్రునకు, దారుకుఁడు శ్రీకృష్ణునకుం బోలె సారథ్యము గావించి సారథ్యకర్మయందు శ్రీకృష్ణునిశక్తికిమించు సాహస శక్తి జూపఁగల్గె నని యీక్రిందిపద్యముచే స్థిరపడుచున్నది.

చ. మనము కలంకదీఱ రిపుమర్దనవిక్రమ మొక్క తేరు నీ
ఘనభుజశక్తిప్రాపున నఖండితశౌర్యమహోన్నతుండ నై
యనిమొన సారథిత్వముమహత్త్వము వైరులు మెచ్చఁజూపెదన్
ననుఁ బనిగొమ్ము లెమ్ము కురునాథు నదల్పు మరల్పు గోవులన్.

ఇట్టిసారథ్యసాహసశక్తిని జూపయత్నించుటయేకాక యీయుద్ధకథాభాగమును జదివినవారి కతఁడట్లు ప్రవర్తించె ననికూడ విధిగా వ్యక్తమగును.

ఈ యుదాహరించిన విషయములచే నుత్తరుఁడు వీరుఁ డని స్థిరపడుచున్నను స్వర్గమునకుఁ గట్టుగావలిగాఁ బోవులలితవనమనఁ బరఁగు సేనాపరాగము కలిగి లలితదృశ్యరూపముననున్న కురుసైన్యమును జూచి యుత్తరుఁడు భీతి చెందె నని సామాన్యమానవునికంటె హీనముగ వర్ణించి తుద కర్జునునిచే నుత్తరుఁడు శూరాధముఁ డని యీక్రిందిపద్యరూపమునఁ బలికించెను.

చ. ఘనభుజశక్తిమున్ రిపులదర్పము నేర్పడ జూచిచూచి యె
ట్లును దెగకున్నఁ బోక యిది లోకము చక్కటి శూరులైన దీ
నిని మది మెచ్చ రీబలము నీదెసఁ దేఱియుఁ జూడ దింతకున్
మును భయహేతువైనవిధముం దగఁ జెప్పుము నాకు నిత్తఱిన్.

ఉత్తరునిదెస నీవిధము లగునీచవర్ణనములు గావించుట యర్జును నసహాయవీరత్వమును లోకులకు వెల్లడించుట కని గ్రహించునది.

అర్జునుని బాహులఘుత్వ, గమనభంగి మున్నగువానిని భీష్మ ద్రోణకృపాదులు గ్రహించి వచ్చెడువాఁ డర్జునుఁడే యని గుర్తించి యతని విక్రమాదిగుణసంపత్తిని వర్ణింప నవకాశము కల్పించుటకై, ఉత్తరుఁడు సైన్యమును జూచి భయపడె నని చెప్పినమాత్రమునఁ దనివితీరక యతనియందు బహుహైన్యమును దైన్యమును సూచించురథలంఘనాదికము వర్ణింపఁగడఁగెను. రథమునుండి లంఘించి యుత్తరుఁడు పర్వెత్తనిచో రథస్థితబృహన్నలాచ్ఛాయలు ప్రాజ్ఞు లగుభీష్మాదులుకూడఁ దెలిసికొనుట కశక్యముకదా !

మఱియు విరటుఁడు దక్షిణగోగ్రహణమునకుఁ బోవునప్పుడు 'పిలువని పేరంటము చెప్పనివిందు' అనునట్లు యుధిష్ఠిరుని రమ్మనకున్నను యుధిష్ఠిరుఁడు సమయముకల్పించుకొని బృహన్నలను విడచి తక్కినతనసోదరులయుఁ దనయు యుద్ధకుశలత్వమును వివరించి యతని నంగీకరింపఁ జేసి వెంటఁబోయె ననినుడువఁబడినది.

“దక్షిణదిశకు ససైన్యుఁడై విరటుఁడు సుశర్మపై దాడివెడలును. పంచపాండవులును దప్పక యుత్తరదిశను నర్జునయుద్ధమునకు రాఁగల్గుదురు, అప్పుడు వారిని గుర్తించి తిరిగి వారిని నరణ్యవాసాజ్ఞాతవాసంబులకుఁ బంపుద”మనుకొనుసుయోధనునూహకు విరుద్ధముగా ధర్మభీమనకులసహదేవులను దక్షిణదిశ కంపి యుత్తరదిగ్యుద్ధమునకు నర్జును మిగుల్చుటకును, తనసోదరులసంగ్రామకౌశలము వర్ణించుయుధిష్ఠిరునిచే విరటుని సమ్ముఖమున బృహన్నలాపరాక్రమము వర్ణింపఁబడకుండఁజేయుటకును హేతు వుత్తరగోగ్రహణయుద్ధసందర్భమునఁ గవి యర్జునునకు లోకైకవీరత్వము నాపాదించి పాత్రౌచిత్యమును బాటింప సమకట్టనూహామే యని యెన్నఁదగును. ఇంతియగాక యింతకుముం దుదాహరించి

నవిషయములను బట్టి యచేతనమగు నుత్తరపాషాణము నాధారము చేసికొని కౌరవసేనాసముద్రము నసహాయుఁడై పార్థుఁ డొక్కఁడే యీఁదఁగల్గెనను ప్రతిష్ఠలోకమున వ్యాపింపఁజేయ నర్జునవీరత్వమును బోషించుకొనుచువచ్చెను.

పరిశీలించి చూడ నుత్తరుఁడు వీరోత్తరుఁడు. ఉత్తరగోగ్రహణముత్తరగోగ్రహణమే. ఎట్లనను నజ్ఞాతవాసగుహాంతర్గతార్జునసింహపరాక్రమాదులు దుర్యోధనాదిమత్తేభంబులకుఁ జవిచూప నుద్దేశించుచు వీరుఁడగు నుత్తరుని హీనోత్తరునిగా వర్ణించి కవి యర్జునపాత్రౌచిత్యమును బాటించె నని పాఠకులు విమర్శకులు గ్రహింతురుగాక.

తవుటిపాములు.

కీ. శే. కొత్తపల్లి సూర్యారావుగారు.

కాకినాడ, ఆతిళ్లయగ్రహారములోని నన్నయభట్టారకవిలాసము వారు, దీపావళిసెలవునాఁడు చిన్నసభ పెట్టుకొనిరి. సభ్యులు పెక్కుమందికిఁ గొందఱుమాత్రమే రాలేదు. ఆనాఁడు చిన్నచర్చ జరిగినది. వారము దినములనుండి కద్రూవినతలు శ్వేతాశ్వమును గాంచుటమొదలగు కథాభాగమును, ఆదిపర్వములో నున్నదానినే విమర్శించి చదువుచుండిరి.

"ఆయతవక్షతుండహతి నక్షులశైలములైన (లెల్ల) నుగ్గుగాఁ
జేయుమహాబలంబును బ్రసిద్ధియుఁ గల నాకు నీవనిం
బాయక యొమ్మనం దవడుఁ బాముల మోవను వారికిం బనుల్
సేయను నేమికారణము సెప్పుము దీనిఁ బయోరుహాననా! ౨౩-౪౯౬.

దవడుఁబాములా, అవడుఁబాములా, తవడుఁబాములా, కొన్ని ప్రతులలో "నెపుడుఁ బాములమోవ" నని యున్నది. ఇందేది సరియైనది? తవడుఁబాములన్=ప్రాఁకునట్టిపాములన్ అని యర్థము వ్రాసినారు. నడచుపాములుఁగూడఁ గలవా? యొమ్మనందు + అవడుఁబాములు, అనియా? యొమ్మనన్ + తవడుఁబాములు, అనియా. ప్రాఁకునట్టి పాములనుటకుఁ దవడుఁబాములని యేకోశమునను నాధారము గనఁబడదు. అవడు= అగడు. అనునది భారతము పైపద్యములోనే గాని యేకోశములలోను గానరాదు.

అంత యందమైనపద్యమును రచించిన నన్నయభట్టారకుని, అవడుఁబామా, తవడు బామా యని యల్పబుద్ధితో నెట్లడుగఁ గలము. ఏకవియు దీనిని వాడియున్నట్లు తోఁపదు. భారతము లక్ష్మీపతి సోమయాజులుగారి వ్యాఖ్యానగ్రంథము దొరకలేదు. సంస్కృతములో నెట్లున్నదో యని వెదకిచూడఁబడియెను.

"సవిచిన్త్యాబ్రవీ త్పక్షీ మాతరం వినతాం తదా
కింకారణం మయామాతః కర్తవ్యం సర్పభాషితమ్. ఆస్తిక ౨౦ అ. ౭ వ శ్లో.

అని మాత్రమున్నది. ఒక్కదానిఁగో "సర్పభాషణం" అని యున్నది. ఈచిన్నశ్లోకమున కెంత మనోహరార్థకల్పనలతోఁడి పద్యమును నన్నయ భట్టారకుఁడు రచించెనో యని యానందింపని వా రెవ్వరు? స్వతంత్రించి యథేచ్ఛముగా, మూలమునుండి కథను వ్రాయఁ దలఁచి భారత బద్ధనిరూపితార్థ మేర్పడ నెఱిఁగింపుమని రాజు కోరుటచే నుపక్రమించి నతఁ డట్లు రచించెనేమో. మూలమునకు దగ్గఱగా నాంధ్రమున రచించుటకై యత్నించి "క్షురము" అను దానికి "దారుణాఖాండలశస్త్రము" మన నన్నయభట్టుగారిని మెచ్చని శ్రీకృష్ణభారతములో నేమున్నదో చూతమని తీసితిమి.

"అతులతకః ప్రభావనిధి యైతుడికెక్కిన కశ్యపప్రజా
పతికి సుతుండనై ప్రథితపక్షబలార్జితవిక్రమంబునఁ
క్షితిధరకోట్లనైన నుసిఁజేయ సమర్థతగల్గి వెలునే
నతినికృతిఁ భుజంగులకు నంజలి సేయఁగ నేటి కమ్మరో.

అని యున్నది. ఈ రెండు పద్యములకు నభిప్రాయములో నంత భేదము లేదు. కల్పనలోను గనఁబడదు. మనోహరతకుఁ గొఱఁత లేదు. భట్టారకుని పద్యములోవలెఁ బయోరుహానసా యనక అమ్మరో యున్నది తగియున్నది. మూలాధారము నట్టెకోరువాఁడుగాక స్వతంత్రుఁడై నన్నయగా రట్లు రచించిరేమో. శ్రీకృష్ణభారతమునకు మూలాతిక్రమణము కిట్టనట్లు పొడకట్టుచున్నదిగదా! "అంజలిసేయఁగ నేటికమ్మరో" అన్నది. అతినికృతిం బనులు సేయుటగాదు, బిడ్డల నెత్తుకొనుటగాదు, అంజలి సేయుట యేమూలములో నున్నదో. ఇంకొక్క సంస్కృతభారతమును దీసినారము. అందు ౨౨ అ. ౭ వ శ్లోకము.

"కింకారణం మాయా మాత! కర్తవ్యం సర్పభాషితమ్"

అనియు సభోజ్ఞాపికలో

“కి మర్థంచ వయం సర్పా స్వహామో దుర్బలాధమాన్”

అనియును గలదు. ఆహా! యిట్టి స్వల్పార్థశ్లోకమున కనల్పార్థపద్యమును రచించిన నన్నయభట్టారకుఁడు భారతమంతయు నీరీతినే వ్రాసినచో భూలోకము పట్టునా! ఒక్క మహాకవి బండ్లమీఁద నెక్కింప నాయన్నాఁడఁట. ఇప్పు డట్టిగ్రంథమే వ్రాసియుండినచో రైళ్లమీఁద నెక్కదా! చాలు! నీసంగ్రహభారతమునే శ్రద్ధగాఁ జదువలేకున్న మా విలాససభ్యులవంటివారు దాని నెట్లు చదువఁగలరు!

ఏదో నీరసపాఠము క్రిందఁ బుటయుకుగునఁ ఒడవైచిన “వహామోదుర్బలాధమాన్” అను ముక్క కేదో “అఘ్మునం దవడుఁబాముల మోవ” నని గరుడునిచే ననిపించినది! శబ్దరత్నాకరము ఈపద్యమునే “వని” రెండవయర్థములోను “అవడు” అనుచోటను త్రిప్పి త్రిప్పి కొట్టినది. పైఁగా నిది వ్రాఁతప్రతులలోని పాఠమన్నది. అచ్చుప్రతులసంగతి తెల్పను. అవడు, అగడు, తవడు, ఎవ్వడు, ఇట్లర్థరహితపదములను విశ్వసించుటకంటెఁ “తవుటిపాములమోవ” నన్నచో “దుర్బలాధమాః” అన్నదానికి సరిపడునేమో. తవుటిపాములను నవి యొకజాతి నిర్వీర్యపుఁ జేఁపలు-పేరు పాములే కాని, పాపము వానికి క్రౌర్యము లేదు, విషము లేదు. తేలికగాఁ బట్టుకొని చంపి మత్స్యభుక్కులు మాంసభుక్కులుఁ గూడఁ దిందురు.

దీనినే మలుఁగుఁబామని యందురు. ఆయుతశక్తుండహాతి నక్కులశైలములైన నుగ్గుగాఁ జేయుదునని నన్నయభారతమును, “ప్రథిత పక్షబలార్జితవిక్రమంబున క్షితిధరకోట్లనైనను సేయుదు” నని శ్రీకృష్ణభారతమును (పాప మీరెండవది ముక్కు లేకుండఁగనే రెక్కలచేతనే కొండలు పిండిచేయుఁదు నన్నది) ఇట్టిసామర్థ్యము గలవాఁడనని పొగడఁబడుచున్న నేను తవుటిపాములను, వానపాములను మోవబనేమి, పామన్నారుగదా యని యిట్టి తుచ్ఛకీటకములను నేను దినవసరిగదా ముట్టనైనముట్టనే అట్టి మనకీగ్రహచార మేలకల్గినదని తల్లితో గరుత్మంతుఁ డన్నాఁడేమో.

గ్రాంథిక గ్రామ్యభాషావిమర్శనము.

బ్ర॥ శ్రీ॥ మల్లాది రామకృష్ణవిద్వచ్చయనులుగారు, బెజవాడ.

దినపత్రికలు, వారపత్రికలు, పక్షపత్రికలు, మాసపత్రికలు నాంధ్రదేశమునఁగలవు. వీనిలోఁగొన్ని సనాతనధర్మప్రోత్సాహకములు, కొన్ని ధర్మధ్వంసకములు-అదియటుండనిండు-ఎద్ది యెటు లైనను వీరందఱుఁ జిరకాలమునుండి వారికి సాధ్యమైనంతవఱకు నాంధ్రవ్యాకరణమునకు విరుద్ధము గాని భాషయం దే వ్యాసముల వ్రాయుచుండెడివారలు. జనులు వారివా॥వాసనల కనుగుణములగు పత్రికలఁ జదివి సంగతులు గ్రహించెడివారలు. కొలదికాలమునుండి పత్రికలలో మహాకవు లనఁదగినవారలును మహాపండితు లనఁదగినవారలును దేశప్రఖ్యాతులును వ్రాయువ్యాసములును-గ్రామ్యభాషతో నిండియుండుటవలన వ్రాసినవారిప్రసిద్ధిఁబట్టి యేమైనవిషయముండునేమో యని చదువ నుద్యమించుటతోడనే వొచ్చాయి, పోయాయి, పోర్సు యిట్టి యపభ్రంశముల నన్యభాషాపదములను జేర్చినందునఁ గర్ణకఠోరము లగునశ్రావ్యపదముల వినుటతోడనే నిరుత్సాహముచే నిరసింపవలసివచ్చుచున్నది. మనుజులు తమయిండ్లలో నున్నప్పు డేసామాన్యపు చినిఁగిపోయినట్టియు మాసిపోయినట్టియు వస్త్రముల వాడుకొనినను బదుగురిలోనికి వెళ్లవలసివచ్చినప్పుడు తమయుపపత్తికిఁ దగినవస్త్రముల నలంకారముల ధరించియే వెళ్లుచుందురు. రాజద్వారమున వానిస్థితి కనర్హము లైనవస్త్రముల ధరించి యధికారియొద్దికి వచ్చెనేని దన్నగౌరవపరిచిన ట్లాయధికారి యెంచును. ఇది లోకవ్యవహారము. నేఁటివఱకు నాంధ్రదేశమున నేమి యితరదేశములలో నేమి వారివారి యిండ్లలో వారియలవాటునుబట్టి యెట్టియపశబ్దములు గలభాషను వాడినను వారు గ్రంథములలోఁ గాని పత్రికలలోఁ గాని వ్రాయునప్పుడు తమకు సాధ్యము లైనసుశబ్దములలో వ్రాయుచుందురు. పద్యకావ్యమువలెనే గద్యకావ్యముకూడ భాషానియమబద్ధమై యుండుట న్యాయము. ఈన్యాయ మశ్రావ్యపదభూయిష్ఠము లగువ్యా

సములు వ్రాసిన లోకోత్తరు లగుకవులకుఁ గాని, పండితులకుఁ గాని, తెలియనివిషయము కాదు. పామరులప్రీతికై భాషానియమముల నుల్లంఘించుట విషాదకరము.

బాలసఖిత్వ మకారణహాస స్త్రీషు వివాదోఽసజ్జనగోష్ఠీ
గర్దభయాన మసంస్కృతవాణీ షట్సు నరో లఘుతా ముపయాతి.

యను సభిజ్ఞోక్తి నైన గమనించి పండితులును, కవివరులును నిట్టియసంగతపుభాషను వ్యాసములం దుపయోగింపకుండుటకును, భాషాశుద్ధి లేనియిట్టివ్యాసములం బత్త్రికాధిపులు ప్రకటింపకుండుటకును బ్రార్థితులు. వీరలిటులే ప్రకటించుటకు మొదలిడిరేని

యద్య దాచరతి శ్రేష్ఠ స్తత్త దేవేతరో జనః
స యత్ప్రమాణం కురుతే లోక స్త దనువర్తతే.

యను శ్రీభగవద్గీతావచనప్రకారము నియామకాభావముచే భాష భిన్నభిన్న మైపోయెడిని.

ఇట్టిగ్రామ్యభాషాభూయిష్ఠవ్యాసములను ప్రాజ్ఞులగుకవివరులను, పండితులును వ్రాయుఁబూనిరేని శుద్ధభాషకుఁదిలోదకపిండప్రదానములు సేసిన ట్లగును. దీనికి వ్యాసముల వ్రాసినవారలే ప్రవర్తకు లగుదురు. తెన్గాల మగునపఖ్యాతికి, దురితమునకు వారే బాధ్యు లగుదురు. ఈ సుప్రసిద్ధు లెట్టిభాషలో వ్రాసినను వారియశస్సునకుఁ గొఱంత లేకఁ బోవచ్చును. దీనివలన భావికాలమున సంభవింపఁబోయెడి యనర్థమునకు లోకాయతమతమునకు బృహస్పతివలె వీరుమార్గదర్శకు లగుదురు. నే నొకరిని దూషించుతలంపుతో నీవ్యాసము వ్రాయలేదు. సుహృద్భావముతో నిట్టివ్రాతలమూలమునఁ జెడియున్నజనుల నింకను జెఱుపకుఁ డని సవినయముగ విజ్ఞులఁ బ్రార్థించుచున్నవాఁడను. ప్రతిఖండనములతో నవసరము లేదు. గుణముండిన గ్రహింపవచ్చును. దోష ముండిన క్షమింపుఁడు.

గుణదోషౌబుధో గృహ్ణ న్నిందుక్ష్వేళా వివేశ్వరః
శిరసాశ్లాఘ్యతే పూర్వం పరం కంఠే నియచ్ఛతి.

యను శ్లోకార్థమును గమనింపఁ బ్రార్థితులు.

శ్రీరామోత్తరేతివృత్తము.

సాహిత్యవిశారద కాశీభట్ట సుబ్బయ్యశాస్త్రిగారు.

కవితావాహిని ఉపజ్ఞానుకారానువాదభేదములచే మందాకినీవాహినివలెఁ ద్రిపథగామినియై వరలుచున్నది. అందుపజ్ఞయన గవివరుని యపూర్వకావ్యనిర్మాణము. అనుకారమన నొకకవిచే వ్రాయఁబడిన కావ్యేతివృత్తమును దీసికొని యాభాషయందే కొలఁదిమార్పులతోఁ దిరుగ వ్రాయుట. అనువాదమన నొకభాషలోఁ జిత్రింపఁబడియున్న కావ్యవస్తువు వేఱొకభాషలోనికి నవతరింపఁజేయుట. ఇట ననుకారానువాదము లుభయములును నుపజ్ఞములోని యితివృత్తమునకుఁ గ్రొత్తమార్పులు చేర్పనగును.

కావ్యము లోకమున కస్తోకానందమును సమకూర్చునదిగా నుండవలయునన్న ఆపుస్తకమునందు స్తుత్యమగు కథావస్తువు విస్తరీకరింపఁబడి యుండవలయును. ఉత్తమశ్లోకజీవితవిలసితములగు కావ్యములు, ఏనాఁటివనునన్నను, ఎన్నిసార్లువిన్నను తనివితీరదు. తిరుగ వినవలయు నను నభిలాష యుదయించుచుండును.

పావనానురాగశోభితులగు నుత్తమదంపతులు నాయికానాయకులుగానున్న కావ్యములకుఁ గల కళ కళత్రవిరహితులగు బ్రహ్మచారిసన్న్యాసులు నేతలుగానున్న కబ్బములకబ్బదు. కావుననే ప్రసిద్ధగ్రంథమందారములన్నియు నాయికానాయకానుకూల్యజీవితసుమమంజరీసౌరభమంజులములై వెలయుచున్నవి.

అట్టిగ్రంథరాజములన్నిటను నగ్రగణ్యమగునది రామాయణకావ్యము. దీని నాసేతుశీతనగము స్త్రీపుంభేదములేక భారతీయులెల్లరు గుంపులుగుంపులుగాఁగూడి విసుగు విరామములువీడి, అత్యాసక్తితోడను, అమితభక్తితోడను వినుచుండుట కాననగును. ఇందుకుఁగారణమేమి? ఇందుఁ గావ్యనాయకులగు సీతారాముల పావనజీవితములు సుధాతిమధురముగాఁ జిత్రింపఁబడి యుండుటయే.

మున్ను త్రేతాయుగమున శ్రీరామసమకాలీనుఁడగు వాల్మీకి మునిసింహుఁడు శ్రీమద్రామాయణకావ్యమును సకలమానవమనోహరముగా నిర్మించియుండెను. ఈకావ్యరాజము సప్తద్వీపసుందరమగు వసుంధరవలె సప్తకాండములతో నలరారుచున్నది. ఇందలి యుత్తరకాండేతివృత్తమును జేకొని, పలువురు కవివరులు అనుకారానువాదరూపములగు కావ్యరాజముల విరచించియున్నారు. ఆప్రబంధములయందు వెలయుచున్న సీతాపరిత్యాగరంగరమ్యతనుగూర్చి ప్రశంసింపనెంచి యీవిమర్శమును వ్రాయఁబూనితిని.

విమర్శమన నొకగ్రంథమును బఠించునపుడు చదువరికి గోచరమగు గుణదోషముల వ్యక్తీకరించుటకుఁ జేయుచర్చకాని, వాదులాడఁదీకొను రచ్చకాదు. కొందఱు విమర్శనమన నేదియో దురితకృత్యమని భావింతురు. మఱికొందఱు సాహసకార్యముగాఁ దలంతురు. ఇటులే పలువురు పలుతెఱంగుల నూహింతురు. ఈభావములన్నియు భ్రమలు కాని ప్రమలుకావు. సువర్ణభూషణములకు వర్ణమును గొనివచ్చునది శిలాశలాకాస్పర్శమే. కావ్యవర్ణనములకు లావణ్యమును దెచ్చునది సాహిత్యకలావిమర్శనమే. సందియము లేదు.

విమర్శనము విమర్శకుని ధీశక్తిని బురస్కరించుకొని గుణదోషపరిష్కారములఁ జేయుచుండును. ఈవిమర్శకార్యమునకెల్లరు నర్హులే. సకలకావ్యములు నర్హములే. అంతియకాని, ఇట్టివారు విమర్శకులుగా నుండఁదగినవారనియు, నిట్టికావ్యములు విమర్శనీయములనియుఁ బ్రత్యేకముగా నొకవిభాగమును జూపెట్టుపట్టికలేదు. మఱియు వ్యక్తులరుచులను బట్టి విమర్శనములు వివిధరూపములతో నుండును. భావసమాధినుండి కవితావాహిని వివిధగతులపొర్లి వెల్లువగావచ్చునట్లే యూహాకుహరమునుండి విమర్శప్రవాహము పొంగి పలుదారులఁ బరుగిడుచుండును.

విమర్శకుఁడు తమకిష్టుఁడైనచో వానివ్రాఁతలు బంగరుపూఁతలని మెచ్చుటయు, నాతఁడనిష్టుఁడైనచో వానిచర్చలు రొచ్చుగుంటలని

నిందించుటయు సంకుచితహృదయలక్షణము. విమర్శకుని వ్యక్తిత్వ
మును బురస్కరించుకొనక యాతని విమర్శమర్యాదనుబట్టి గుణాగుణ
నిర్ణయముచేయుట విశాలహృదయచిహ్నము.

నేఁటి యపూర్వమేధానిధులుకొందఱు విమర్శనములు మృదు
భావసుందరములై మంజులపదాలంకృతములై కుకథనులఁ ద్రొక్కక
సన్మార్గముల సత్యనిర్ణయమునకుఁ బూనుకొనవలయునని నోరూర
శ్రీరంగనీతులఁ బలుకుచుందరు. కాని యావిద్యాసాగరులు కలముఁజేపట్టి
విమర్శకు గడఁగునప్పుడుమాత్రము పైపురాణవైరాగ్యమునుగంట సహ
జాసూయాతరంగముపైకెగయఁ బరులవ్రాఁతలఁగసిదీర దూరుచుందురు.

అట్టివారు లోకవంచకులగు వ్రాయసకాండ్రుకాని సత్యరతులగు
విలేఖకులుకారు. ధీరుఁడగు విమర్శకుఁడు ఆత్మబోధల నాధారముగాఁ
గైకొని, కావ్యమునందు గుణములఁ బ్రశంసించుటకును, లోపములఁ
బ్రదర్శించుటకును పూనుకొనునేకాని యీమోసపువ్యాసములఁగాంచి
కలము నిలుకఁగోరఁడు. నిజముగా సచ్ఛింతతోఁ గవివిమర్శకులఁ గనిపెట్టు
వారు బ్రహ్మణ్యులనఁదగుదురు.

నేఁడు వేదములు మొదలెంకిపాటలవఱకుఁగల వాఙ్మయసాగర
ముపై ననంతములగు విమర్శతరంగములు చెలరేగుచుండుట లేదా? కృ
ష్ణద్వైపాయనమునివిరచితమగు భారతామ్నాయసంపుటముయొక్క పు
టలనాడఁబెఱికి, ఆలతిపై నుఱికి వానినలువురు వదలఁగొట్టి వెల్లరం
గునుబట్టింపఁ బాటుపడెడి మేటిచదువరులెందరు లేరు? కావునఁ గావ్య
ముతోఁబాటు విమర్శయును, నీడవలె జంటగా నంటియుండును. ఇంతటి
తో నీవిమర్శప్రశంసను విరమింపఁజేసి నేచెప్పఁ బూనెంచినవిషయమును
వివరింతును.

భవభూతికవివరుఁడు వాల్మీకిమునీంద్రుఁడు సంస్కృతభాషలో విర
చించిన రామాయణోత్తరకాండములోని యేకదేశేతివృత్తమును జీవితము
నగాఁజేకొని, నిజమేధాచాతుర్యసంపద మెఱయ హృదయంగమము
లగనపూర్వరంగముల నందు సంధించి, సుందరరూపములో నుత్తర

రామచరిత్రనాటకమును నిర్మాణముచేసి యున్నాఁడు. ఈసువాగ్విభూతి విరచించిన యుత్తరరామచరితము లోకోత్తరాసాధారణపరిణామరమణీయమగు కరుణరసముతోనిండి హృదయాకర్షకమై వెలయుచున్నది. కావుననే "ఉత్తరే రామచరితే భవభూతిర్విశిష్యతే" అనెడి ఖ్యాతి సారస్వతసభోవీథిని సార్వజనీన గౌరవముతోఁ బ్రతిధ్వనించుచున్నది.

పరిశీలించిచూచినచో నీశ్రీరామోత్తరచరితమంతటిలోను హృదయంగమములగు రంగములు రెండు. అందొకటి హృదయారవిందమును నానందామోదభరితమునుగాఁ జేయు సీతాపరిత్యాగరంగము. రెండవది స్వాంతమును సంతసాక్రాంతమునుగాఁ జేయు కుశలవయుగళమేళనరంగము. ఇఁక మిగిలినరంగములు వీని కంగములు.

ఇట్టి మనోహరములగు ఘట్టములరెంటను భవభూతిమహాశయుఁడు కుశలవమేళనరంగము నుత్తరచరితములో నతిమోహనముగాఁ జిత్రించి యేలకో! సీతాపరిత్యాగరంగమును సూచించి విడచెనే కాని పైరంగమట్లు కర్ణపేయముగా వర్ణింపఁడాయె. భవభూతి యీరంగము నుగూడఁ జిత్రించియుండినచో నుత్తరరామచరితము మఱెంతటిహృద్యమైయుండెడిదో!

భవభూతిని వినా యితరులగు సంస్కృతాంధ్రకవివరులెల్లరు నీసీతావివాహఘట్టమును దమకావ్యములలో నతిమనోహరముగాఁ బ్రవర్ణించియున్నారు. ఈయుత్తరకథ కుపజ్ఞమగు నుత్తరకాండమునందుకంటెఁ దదనుకారకావ్యముల నీకట్టు నతిరమ్యముగ వర్ణించిన కవిచంద్రులిరువురు. వారిలో మొదటివాఁడు కాళిదాసమహాశయుఁడు. రెండవవాఁడు దిఙ్నాగమహాపాదయుఁడు. ఈకవిచంచరీకము లిరువురును వాల్మీకిభాస్కరునిచే వికసింపఁజేయఁబడిన యుత్తరకాండేతివృత్తారవిందమునందలి సీతాపరిత్యాగకథామధుమాధుర్యమును సంగ్రహించి, ఒకరు శ్రవ్యకావ్యపాత్రమునను, వేఱొకరు దృశ్యకావ్యభాజనమునను బూరించి యున్నారు. రసికులగు సోదరులయానందమునకై యిందు ముందు వాల్మీకిసంయమీంద్రోపజ్ఞమగు నుత్తరకాండమునందు అన లీసీతాపరిత్యాగ

ఘట్ట మెట్టిమనోహరరూపమునఁ జిత్రింపఁబడి యున్నదియో యా శ్లోకభావముల నిట వివరింతును.

అట గంగాతటమున లక్ష్మణుఁడు సీతకు శ్రీరామపరిత్యాగ వార్తను దెలిపినతోడనే యాభూజాత మూర్ఛితయై కొంతతడవునకుఁ దెలివినంది యిట్లు పలుకఁదొడగెను.

(1) "లక్ష్మణా! నాకుఁ బ్రత్యక్షమగుచున్న దుఃఖదేవతారూప మును జూడ నలువ నానొసట దుఃఖానుభవమునే దీర్చి వ్రాసినట్లు విదితమగుచున్నది. (2) మున్ను పూర్వభవమున నే నెన్ని దురితములఁ జేసియుంటినో! ఎందఱిని దారదూరులనుగ నొనర్చియుంటినో! లేకున్న విశుద్ధచరితయగు సతికిఁ బతివియోగదుర్గతి యెట్లు సంప్రాప్తమగును? (3) మునిజనులనడుమ నీ వొనర్చినతప్పేమి? మహాత్ముఁడగు శ్రీరాముఁడు నిన్నుఁ బరిత్యజింపఁ గారణమేమి? అనెడి నుడులు పిడుగులవలెఁ జెవులఁబడినపుడు నే నేమని బదులు తెల్పుదును? (4) సుమిత్రానందనా! నాయందు సంరక్షణీయమగు మీరవివంశాంకురతేజమే లేకున్న నీక్షణమున నాజీవితము నీపావనజాహ్నవీనీరములలీనముల చేయకుందునా? (5) వత్సా! మాయత్తలకందఱకు నే చేతులుజోడించి వినయముతో పాదవందనము లాచరించితి ననుము. ఆనృపాలునకుఁ గుశలము నివేదింపుము. (6) లక్ష్మణా! ఈసీత జనాపవాదములకుఁ గుందుచున్నది కాని శరీరవినాశమునకు బెగ్గడిల్లుటలేదు" అని మీయన్నకు విన్నవింపుము. (7) మఱియు సతికిఁ బతియే దైవము, బంధువు, గురువు నగుటచే సతి పతికీర్తికై ప్రాణములనుగూడ నర్పింప సంసిద్ధయై యుండును కాని వెను దీయదని యా రాజశిఖామణికి నచ్చఁజెప్పుము."

ఆర్యసోదరులారా! కంటిరా సీతావచనములయందలి వినయాభిమానవికాసముల సీతనుమించిన ధీరస్వాంతయగు పురంధ్రీలలామ యీ పృథివీస్థలిని వేఱొకయామె కలదా? ఇంతటితో వాల్మీకిమునివరుని సూక్తులనిలిపి, వీని కనుకారములగు కాళిదాసకవిచంద్రుని మధురభాషితముల వివరింతును. ఈకవిపుంగవుఁడు రఘువంశమునందలి చతుర్దశసర్గములో నీసీతాపరిత్యాగమునిట్లు వర్ణించియున్నాఁడు.

సౌమిత్రి యంతర్వత్నియగు శ్రీరామపత్నిని గంగదరిని జేర్చి దుస్సహపతిపరిత్యాగవార్త నెఱింగించి యిట్లు ప్రార్థించెను. (1) "మాతరో! పరాధీనజీవనుఁడగు నీరామానుజుఁడు తెలిపిన వాక్పారుష్యమును క్షమింపుము" (అని విషాదనమ్రుఁడై యున్న మఱఁదిని లేవనెత్తి సీతపలికిన వాత్సల్యోక్తు లెంత మృదుసుందరములై యొప్పుచున్నవియో పరికింపుఁడు (2) సీత-"సౌమ్యహృదయా! సుమిత్రాతనయా! నీ వినయసంపద కెంతయు సంతసించితిని. నీయెడ నా కాగ్రహమెన్నఁడు కలుగనేఱదు. వత్సా! ఉపేంద్రుఁ డింద్రునికి బలె నీ వారాజేంద్రునకు విధేయుఁడవై చిరంజీవివి కమ్ము."

అనిపలికి పిమ్మట అత్తలకందఱకు విన్నవింపుమన్న వినయకందళితసందేశభాషితములెట్లు సుధాస్యందములై వెలయుచున్నవియో గమనింపుఁడు. (3) "లక్ష్మణా! జ్యేష్ఠానుక్రమముగా మాయత్తగార లందఱకు నావినయాభివందనముల ముందందఁజేసి యిట్లు ప్రార్థించితి నని విన్నవింపుము. నాయందు వెలుగందు మీానందనసంతానతేజము కీర్త్యానంద సుందరమై వర్ధిల్లునట్లు మానసముచేఁ దలంపు మనుము." (అనఁగా మీానందనునిచే నిందితచరితగాఁ దలంపఁబడి పరిత్యజింపఁబడిన యీవసుంధరానందనగర్భముకూడ హేయమేయని యోజించి యుపేక్షింపక, మనసున నాశీర్వదింపఁ బ్రార్థించితి ననుము. "మనస్సుచే" అనుటచే మీాసన్నిధి నుండుకొని స్వయముగా దయాపూరితములగు గర్భసంరక్షణసంస్కారముల సాగింపఁజాలకున్నను మనస్సుచేతనైన రవికుల కంద మానందరాజితమై తేజరిల్లునట్లు తలంపు మనుము)

ఇంక సీత శ్రీరామున కందఁజేయుమన్న సూక్తులు సున్నితములై వెలయుచున్నవి. అచటి ప్రణయగాంభీర్యాభిమానసందేశవచనము లెట్లు మఱుపిరిగొని వెడలి యున్నవియోయాలింపుఁడు. (4) "రామానుజా! ఆకోసలసార్వభౌమునితో నిట్లు తెలుపుము. "మీాకన్నులయెదుట పీతిహోత్రపవిత్రయైన క్షమాపుత్రిని సామాన్య

జనాపవాదశ్రవణమాత్రమునఁ బరిత్యజించుట ప్రశంసార్హమగు
మీవిద్యాసంపదకుఁ గాని, అత్యున్నతమగు మీగోత్రగౌరవము
నకుఁ గాని తగియున్నదియా? "అని ప్రశ్నించితి ననుము." (5) మఱియు
మఱఁదీ! "మీభాస్కరాన్వయాంకుర తేజమును సంరక్షింప వలసిన బా
ధ్యత నాయందు లేకున్న నీకున్నహాపవాదానలదందహ్యమానము
లగు మలీమసప్రాణముల మేననిలుపఁగోరుదానను కానునుము" (అనఁగా
సుఖముగాఁ జీవించుటకే కాక స్వేచ్ఛగా మరణించుటకుఁ గూడ మీ
యన్నగారి యనురాగ మడ్డగుచున్నది సుమీ! అని భావము)
(6) నరపాలునకు వర్ణాశ్రమపరిపాలనమే ధర్మ మని మును మనువు
శాసించియున్నాఁడు. కావున మీచే నడవికి వెడలింపఁబడి యటఁ
దాపసవృత్తిని జీవితమును గడఁపనున్న యబలపైఁ దిరుగఁ గఠినశాస
నములఁ బ్రసరింపఁజేయక యొక దీనతపస్వినిగాఁ దలంచి జాలిఁజూపు మ
నుము." (7) రామానుజా! పొరఁబడి నుడువుచుంటిని. నిజముగా నీదుస్స
హమగు నిరసనఖేదము దయాశీలుఁడగు శ్రీరామచంద్రుని వలనఁగలిగినది
కాదు. ఇందులకు వేఱొండు కారణముగలదు. వినుము. మున్ను మీయన్న
పట్టాభిషేకసమయానఁ జక్కగా సింగారించుకొని యొయ్యారముగ రాము
నితో సింహాసనమెక్క వురియుచున్న రాజ్యరమను సరకుసేయక నన్ను
వెంటనిడికొని సంతసముతోఁ గాంతారమునకేగుటచే నాపైఁగుపితయై
శ్రీరామచంద్రుఁడు తనకువశుఁడై యుండుటను గుర్తించి యాతాసిరి యిన్న
తానొంటరిగా నాసుందరాంగునితో సుఖయింపఁదలంచి నన్నాపడుచు
మగనిచే నడవికి గెంటించినది. ఇది రహస్యము (అనఁగా మీయన్న
చంచలమగు రాజ్యసంపదనే మహాభాగ్యముగా నెంచికొని యగ్ని
సాక్షికముగాఁ బరిగ్రహించిన ధర్మపత్నిని దయావిరహితుఁడై పరిత్య
జించెను. సౌమిత్రీ! కంటివా మీయింటిగొప్పతనమును. రాజ్యశ్రీ
మోహితులగు ఆకొమరులు నిజరాజ్యరమల రక్షింపఁగోరునట్లు
స్వకాంతానురాగసంపదలఁ బాటింప నభిలషింపరుసుమా! అని సోపా

లంభోక్తి) (8) మఱియు నిట్లనుము "మంగళాశయులగు మీరలీ దీనురాలియెడ నన్యాయ మాచరింతురని తలంపఁదగదు. కావున నీయసహ్యపరిభవదుఃఖమునకుఁ గారణము తన జన్మాంతరదురితరాశియే యని తలంచిన దనుము." (9) రాక్షసోపద్రవద్రుతవతికలగు తాపసనతులకు మీకటాక్షముచే సంరక్షకయై తనరారిన యాక్షమాతనయ మీరలు సార్వభౌములై వెలయుచుండఁగనే యాఁడదారుల చారలయందుఁ జేరి యెట్లుజీవించి యుండగలను? అని వాపోవుచున్న దనుము. (10) మఱియు నో సుమిత్రాతనయా! "రాజచంద్రా! మీచే నిరసింపఁబడి యడవికి నెట్టఁబడిన యానేలపట్టి యెట్టితప మాచరించిన భావిజననమునఁ గూడ మీరలే ప్రాణేశ్వరులగుదురో, తిరుగ నీరీతి వియోగఖేదము రానేఱదో, యట్టిమునివ్రత మవలంబించి రవిమండలనిహితనేత్రయై జీవితమును ముగింప సంసిద్ధయైయున్న దని నివేదింపుమన్న దనుము" సౌమిత్రి భూపుత్రిని విడచి వెడలినతోడనే యాయిల్లాలు వినువారి యుల్లములు తల్లడిల్లునటుల విలపింపఁదొడంగెను. అపుడు ప్రకృతియంతయు విచారమగ్నమాయెను.

గీ. వృక్షములు పూల నెమళులు నృత్యములను
లేను లాస్యంపుదర్భల నీడియుండె
నామెతో సమముగ దుఃఖమందియున్న
వనమునందు నురోదనధ్వనులునిండె." (ఆదిపూడిసోమనాథరావుగారు)

పాఠకమహాశయులారా! అలించితిరా! ఈవిదుషీలలామధీరోదార భాషితముల. వికల్పమయమున ధీరతను బ్రకటించుటయేక్షత్రకులజాతలగు వీరవనితల లక్షణము. ఈయది యీ భూజాతజీవితమునఁ జిన్ననాటనుండియు విదితమగుచున్నది. ఇంతటితోఁ గాళిదాసుభాషితము లఁజాలించి యుత్తరకాండములోని యీకథానకమునకు రెండవయనుకారమగు కుందమాలయందు దిఙ్నాగకవీంద్రుఁడు పొందుపఱచియున్న సీతాపరిత్యాగరంగమును బ్రకటింతును.

సీ. నరములు నరలును నారులు నేరమి
నీరును నోరును నారసములు
నెరసులు విలునారి నేరుపు లున్నారు
నేరేఱనంగఁ గన్నార మనఁగ
నేరేళ్లు నురుగులు నెరయుంగఁ జల్లుట
నేరక యన నివి న్నియు నవర్ణ
వరము సప్తదశరేఫలు వఱినొప్పుట
నఱియుంగ నెఱిదప్పి నఱిగొనె నన
నెఱియు నెఱసియు నెఱమంట నెఱకు లనఁగ
మఱుముగా మఱుమూడె ను నెఱసఱి యన
నెఱపు నెఱకూరె మఱుపాడె నెఱపె నవఁగ
నీఱుపైఁ గవిసినవిక్కా నూఱువదులు. ౩౦

గీ. నాఱువికుచుట నెఱిలేక నూఱి టనఁగ
నీఱుగాఁ జేయు నెమ్మేలు నెఱక కనుట
నెఱపుగను నెఱిచెందుకల్ నెఱమెఱగ మన
నెఱబిరుదు నెఱవాదులు నెఱిచెడ కన. ౩౧

గీ. నెఱికె గట్టుట నిఱుపేద నెఱపు విడిచి
నెఱికె నెఱనారసము నాటె నఱుజు పేరు
అదిగో నెఱత్రోవ మఱుమువ్యె నన నవర్ణ
వరము ఱాలు ముప్పదియాఱు వవనతినయ. ౩౨

సీ. పరఁగనఁ బరువడి పఱికింపఁ బుఱుడిదు
పురుడు సూతక మగు పొరక యనఁగఁ
బరిమార్చిరి యన దెప్పర మిప్పరు సనఁగఁ
బొరిపొరి పఱుసనఁ బొఁరిగొని రనఁ
బురపురఁ బొక్కంగఁ బొంపిరి పోరఁగాఁ
బెరిఁగె వర్ధిలి యనఁ బెరుఁ గనంగఁ
బరిచనుడెంచె నేర్పరి పెనుపరి పోరి
పోరితం బనఁగను బొరలితి మనఁ

బరపుగలచోటఁ బరపులు పరుసములును
బేరు నామంబు పరుసంబు పోరచి యనఁ
బెరడసఁగ దొడ్డి పరి తేనెపెర యనంగఁ
బేర నెయ్యనఁ బరిగొనెఁ బేరుర మన. ౩౩

గీ. పొరుగు చప్పరంబును బొరపొచ్చెము పురి
కొల్పు పోరామి పొరిగడుగు పిరిగొను ట
పొరయు నీవర్ణోపరిఁ బొలుచు రేఫ
లెన్న నలువదిరెండయ్యె నిజమంత్రి. ౩౪

సీ. కఱచెను వేగంబ కఱపెద కఱపితి
కఱివోయెఁ బఱచిన పాట్లనంగఁ
బిఱికితనమును సంకఱ కఱియ లనఁగఁ
బఱిగొని కఱిమార్చెఁ బిఱుసని యనఁ
బఱిపఱిగాఁ జేయఁ బిఱుఁదనఁ జొచ్చెను
బెఱమూఁక పెఱచేతఁ బఱపనోపఁ
బిఱిదికిఁ జూతె చూపఱ కఱిపోయెను
బెఱిగినచందంబు పిఱుఁదు లనఁగఁ
బఱవక పఱచు పాఱించుఁ బఱుపు టనఁగఁ
జాఱుఁ డన విప్రుఁ డంబులు పాఱుటయును
బొఱక పుఱియలు తెప్పఱ కఱికఱియలు
పెఱికెఁ గోఱలు పెంపఱు పొఱ యనంగ. ౩౫

గీ. పెఱిగె నట్లనఁ బిఱిపెకి పెఱికివచ్చెఁ
బఱపయి నకట్లఁ బఱచిరి కఱవ ననఁగఁ
బఱిక గఱుపాతెఁ జిక్కులుపఱచి రనఁగఁ
బబరములుఱాలు గతిగతుల్ *పవనపుత్ర. ౩౬

సీ. బూరుగు చెట్టగు బూరగ వాద్యంబు
బేరంబు బురుడయు బేరజములు
బరిగట్టె బారెఁడు బరవసంబును బారు
బారమ్ము లేసిరి బారిపడియె

* గతిగతుల్-౪౪.

బూరెలు బోరలు బోరగిలంబడె
బోగని వ్రోసెను బూరటిల్లె
బురుజులు గజ్జెలు బెరసెను బీరమ్ము
బరిమైని బరులుబ్బె బురువు బరదు
బిరుదు బురబురఁ బొంగె నిబ్బరము సబ్బు
రంబసఁగ నివి యీాబవర్ణంబుపైని
సప్తవింశతిరేఫలు జరగునయ్యా
యాజిసుతసేవకవిధేయ యాంజనేయ. ౩౭

గీ. బిఱుసుమట్టించె బఱుసులు బిఱుసు లెందు
బిఱబిఱనఁ ద్రిప్పి వైచె దబ్బఱ లనంగ
బఱబఱన నీడ్చె బిఱుపోయెఁ బనియన నివి
బకరముల తాలు గిరిసంఖ్యఁ బరఁగె హనుమ. ౩౮

సీ. మురిసెను దొండ మామరదంతికిని వన
మొరకతాలును దేంట్లు మొరసె నసఁగ
మారటమార్తులు మేరలు దప్పిరి
మారిమసఁగుటను మోర లనఁగ
మురియలు తునుకలు మరియాద కుమ్మరి
మరిగించుకొనుట వేమా రనంగ
మరలుట మది మేర మెరమెర వనమరె
మురిపెంబు తామరల్ మురముర యన
మరు లుడుపుట మొరదు మారేల్లు మిరియంబు
సుమ్మర యనఁగలై సారిది నున్న
మకరరేఫ లౌను మఱి యెంచి చూడంగ
నిరువదియును నాల్గు హరకుమార. ౩౯

సీ. మఱి మేఘపుమెఱుంగు మెఱయునోకో యని
మఱతుఱు మెఱుఁగెక్కి మొఱసి యింక
మాఱటనోళ్లను మఱచి దిక్కులుసూచి
మఱతును నేనును మా అడుగుట

మఱి మొండె మనుటయు మఱ్ఱాఁకు వేఱ్ఱాఁకు
 మెఱములు వ్రైచెను మొఱయిడి రవ
మొఱగుచు మఱచిన మఱువక మఱియును
 మిఱుమిట్లు గొనియును మెఱయు మెఱసి
మీఱుమీఱియు మెఱములు మెఱుఁగు లనఁగ
మఱపు ముఱిమఱి చీకటి మఱుఁగు మఱఁది
మఱలఁ గ్రమ్మఱి పల్లఱు మాఱి యనఁగ
మాఱుమొగమును మఱపు నేమఱి యనంగ. ౪౦

గీ. మాఱుపడుటయు పెడమఱి మఱఁద లనఁగ
ఆఱు మఱునాఁడు మిఱుచూపు మఱుఁపుకొనుట
మయిమఱపులును మఱలేక మఱకు వనఁగ
మకరమున ఱాలు మునిగతుల్ *మారుతసుత. ౪౧

గీ. రేయి రిచ్చ రిత్త రేమొండ రెం డన
రూఢి రేకు రాదు రూపు రమణ
రమ్ము రార రోఁజు రాగిల్లి రాచూలి
రచ్చ రాయిడియును రాలుటయును. ౪౨

గీ. రారు రాయంచ రాయుచు రాయుటయును
రక్కసియు రోయు రూపింప రంకె లనఁగ
రూపెదను రాకీలి రుచి యనంగ
ముప్పదర్ణముల్ రేఫాది నొప్పు హనుమ. ౪౩

గీ. ఱేఁడు ఱెక్క ఱాచు ఱివ్వన ఱంపిల్లు
ఱిక్క ఱెక్క ఱేసు ఱేపు ఱేవు
ఱవిక ఱట్టు ఱంకు ఱాఁగ ఱంకించుట
యనఁ బదేను ఱాదు లయ్యె హనుమ. ౪౪

సీ. వారించు వారికి వారకంబుగ విరుల్
 వారక యిందు నెవ్వరికి నీకు
వరివంట తలవరుల్ వరుస నార్వురు గాచి
 వేరంబు వెరవున వెరసు లిడిరి

* మునిగతుల్ = ౪౭.

శరవృష్టు విరవిర వారనిసేనల
విఱియంగఁ జల్లిరి విఱియుటయును
గాలుఁవ్రరు నిరువురు కలుఁవ్రరు నెవ్వరు
వీరల వఱటంబు వారువములు
వరుజ గట్టిరి రొావరి వారకు లన
వీర లన దేవ రన సాటి వేరి యనఁగ
వరుసనం గను నిన్ని వవర్ణ శరము
రేఫ లివి యమ్యో ముప్పదిరెండు హనుమ. ౮౫

గీ. వఱలె నఁగను వేడుక విఱిగె విల్లు
వెఱఁగుపడి యాజి విఱుగుట విఱిచె నఁగ
వెఱమృగంబులు వెఱవెఱ వెఱచఱవఁగ
వఱడు గూసెను వేఁబోకవెఱగుతోఁడ. ౮౬

గీ. వఱుతేఁ ద్రోవఁగ విఱివిడి వెఱచి వఱలి
వఱద యనఁగను నెండిన వఱుగనంగ
నమరు విఱిగాలి విఱిపొల్లు నన వవర్ణ
శరము ఱాలివి యిరువ దోవవనతనయ. ౮౭

గీ. సరకు సెరబడి సైరణ సరు లనంగ
సరకుసేయక సురిఁగిరి సొరిది యనఁగ
సురియ సొరవగండ్లును సూరె లనఁగ
సారెసారెన సొగటాల సారె లనఁగ. ౮౮

గీ. సిరి యనంగను లక్ష్మి యగా సేసి రనఁగ
సేసరుల నెక్కి తనసరి నేసి రనఁగ
సప్తదశరేఫ లమ్యో సాక్షరము మీఁద
జానకీజానిచరణాబ్జచంచరీక. ౮౯

క. మును నన్నయభట్టాదులు
మునుకొని రేఫలు ఱకారములు కృతులం గా
ర్చినపలుకు తేర్పించితి
ఘను లిఁక మఱిఁ గలిగెనేని గైకొనఁగఁదగున్. ౯౦

—: నాటకలక్షణము :—

క. శ్రీయాంజనేయ విను మిఁక
నాయతనాటకము లక్షణాంచితగతులన్
మీయున్నతకృపచేతను
ధీయుక్తిని దెలుఁగుగాఁగఁ దెలియ నొనర్తున్. ౫౧

క. చతురాగమజనితం బై
యతులార్థ్యయశస్యవర్యమై యభినయభూ
షితమై తగు నాట్యం బిది
క్షితి నెవ్వఁడు మెచ్చకుండుఁ గృతుల నివ్వన్. ౫౨

క. ఆనాటకవిధములు పది
యా సంధుల కైదుసంధు లగు నంగముల
రైవనాల్గు రామభట మ
హానాటకకావ్యకర్త హనుమా వినుమా. ౫౩

గీ. శాస్త్రవిద్యలు శిల్పప్రశస్తకళలు
విలసితాశుమధురచిత్రవిస్తరముల
కవితలును గావు జ్ఞానయోగములు గావు
నాటకమె సుమ్ము సర్వంబు నయవిమలక. ౫౪

సీ. సంధు లైదును చతుష్షష్ట్యంగములు ధీర
నాయకబీజదల్ నవరసములు
వృత్తులు నాలుగుబీజాదు లైదును
నారంభముఖ్యపదాదు లైదు
సంస్కృతాద్యష్టభాషలకుఁ బ్రక్రియలును
భరతశాస్త్రములలోఁ బరఁగుగతులు
నాటకకావ్యంబునకు వలె నిన్నియు
నానాటకమున కాఖ్యలు పది యగు
సూత్రధారులవిధములు పాత్రగతులు
నభినయంబులు సత్త్వ్వ లరసి పేని
కెలమి లక్షణలక్ష్యముల్ తెలియువలసు
నలమహానాటకముచేసినట్టిహనుమ. ౫౫

క. నాటకలక్షణగతు లివి
పాటిగఁ దెలియంగఁ బద్మభవునకు నైనన్
సూటిపడఁ దనఁగ నితరుల
మాటలఁత తలంచిచూడ మారుతపుత్రా. ౧౬

క. తెలుఁగున నాటకలక్షణ
మిల నెవ్వరుఁ జేయలేదు కృషదశ్వసుతా
లలితమతి నీదుకృపచేఁ
దెలిసినయంతయు నొనర్తు దితిజధ్వంసీ. ౧౭

గీ. నాందితుదను మారిషినేని నటిని నేని
నలవిదూషకునేనిఁ దా నమరఁ జూచి
సూత్రధరుఁడు పిల్చినపిల్పు శోభితముగ
నాముఖం బండ్రు బుధులు శాస్త్రార్థసరణి. ౧౮

గీ. సూత్రధారుఁడు తను గవిసూరిసభను
నాయకునికావ్యమహిమంబు నాందివేళఁ
దగఁ బ్రశంస యొనర్చిన దానిపేరు
శాస్త్రవేత్తలు భువిఁ బ్రరోచనయటండ్రు.

సీ. తనరు వివక్షితార్థ ప్రతిపాదనో
క్తులజాడ గోప్యార్థగోపన మనఁ
గను బ్రకారార్థ ప్రకాశన మభినయ
రాగసమృద్ధియుఁ బ్రకట మగుచ
మత్తారకారిత్వ మతి యితివృత్తవి
స్తర మిది మత్ప్రయోజనము లింక
నితివృత్త మనుదాన నెసఁగ సూచ్యాసూచ్య
ములు రెండు నందులోపలను సూచ్య
మునను దృశ్యమిశ్రద్వయుం బెరయుఁ గలిగ
నయ్యె సూచ్యం బనెడుదాన నైదుపరఁగె
నమరు విష్కంభచూళికాంకాస్యములును
వెలయునంకావతరణ ప్రవేశములన. ౧౯

గీ. అతిశయచతుర్విధాభినయములఁ గల్గి
సాత్త్వికాంగికపూర్వకసరణి మించి
నాట్య మమరు ధీరోదాత్తనాయకాద్య
వస్థల రసాశ్రయం బయి వచ్చి కృతుల. ౬౦

గీ. నృత్యమనఁగ భావాశ్రయా త్యుత్తమంబు
నృత్తమనఁగఁ దాళలయాశ్రితేప్సితంబు
పరఁగ నిందుల నాటకప్రక్రియోక్తి
నలర దశరూపకంబులఁ దెలియవలయు. ౬౧

గీ. క్రమత మధురోద్ధత ప్రభేదములతోడ
లాస్యతాండవరూపకలీలల వహించి
నాటకంబులకుఁ బ్రకృతి నాటుకొల్పె
నృత్యనృత్తశబ్దంబులు కృతులయందు. ౬౨

క. రీతిగ వస్తువు దగు ప్ర
ఖ్యాతోత్పాద్యములు మిశ్రమన నితిహాసో
ద్భూతకవికల్పితశదఃభ
యాతతరచనలను నాటకాదిఁ ద్రివిధమై. ౬౩

క. మొదలిటినాటకపద్యం
బది యార్వదిరెండుపదము లయినను బద్నె
న్మిదియైన న్నెన్మిదైనను
బదురెండిట నైనఁ గూర్పఁబరఁగు సుకవుల్. ౬౪

గీ. ద్వికసంఖ్యచేత వేణీసంహారంబు
పదము లెఱిఁగె నాందిపద్యములను
బరఁగెఁ బదము లినుల బాలరామాయణో
న్మత్తరాఘవాఖ్యనాటకముల. ౬౫

క. శరరసముని వసునవదశ
వరసంఖ్యలయంకములను వరుసను సుకవుల్
దొరకిన సంఖ్యను గూర్తురు
ధర నాటకకృతులయందుఁ దరుచరవీరా. ౬౬

౨౧౨. భిల్లీచందనన్యాయము.

ఈన్యాయము కూడ నొక శ్లోకమందు నిబద్ధమై యున్నది.

శ్లో. అతిపరిచయా దవజ్ఞా సంతతగమనా దనాదరో భవతి
మలయే భిల్లపురంధ్రీ చందనతరుకాష్ఠ మింధనం కురుతే.

అతిపరిచయమువలన నవమానము కల్గును. సంతతగమన మనాదరము బుట్టించును ఎట్లన మలయపర్వతమునకుం గిరాతి చందనపుం గఱ్ఱలను వంటచెఱుకుగాం జేయును.

౨౧౩. శకునిగ్రాహకగతిన్యాయము.

శకునిగ్రాహకుండనంగాం బిట్టలను బట్టువాండు. కాలిచప్పుడు కాకుండ మెల్లంగాంబోయి యురులు మొదలగు సాధనములచేం బట్టుకొనును. ఈరీతిగా యజ్ఞమునకుం బోవునపు డెవ్వరికిం దెలియకుండ రహస్యముగాం బోవుట.

౨౧౪. శలభన్యాయము.

శలభ మనం మిడుత. ఇది మండుచుండెడు దీపముపైం బడి యాత్మనాశమునుగాంచును. కావ్యములయందుం దరచుగా నీవిషయము చెప్పంబడును. కుమారసంభవము ౪-౪౦ లో "అహ మేత్య పతఙ్గవర్త్మనా పునరంకాశ్రయిణీ భవామి తే" అని చెప్పంబడినది. ఈశలభము దీపకాంతిని జూచి ప్రేరితమై దాని నార్పివేయుటకుం బ్రయత్నించి దానిపైం బడు నని మేరుతుంగుండు వ్రాసెను.

"శ్లో. ఉజ్జ్వలగుణ మభ్యుదితం క్షుద్రో ద్రష్టుం నకథ మపి క్షమతే
దగ్ధ్వా తను మపి శలభో దీప్తం దీపార్చిషం హరతి."

౨౧౫. శాంతే కర్మణి బేతాళోదయః.

విఘ్ననివారణముకొఱకు శాంతికర్మ. కర్మ యెంతయు చేయబడినను బేతాళోదయము తప్పలేదు. విఘ్ననివారకప్రయత్నము లన్నియు వ్యర్థమగుట యని యీన్యాయతాత్పర్యము. ఈన్యాయము చిత్సుఖముని వ్రాసిన న్యాయమకరందము నుదాహరింపఁబడినది.

"శ్లో. నను సోయం శాంతే కర్మణి వేతాళోదయ అభేదం
సాధయితుం ప్రవృత్తే న భేదస్తే దనాహృతత్వాత్."

౨౧౬. శాల్యాదివిషయస్య ముసలాదేః కరణస్య శ్యామాకేఽభిహతి ర్భవతి.

ధాన్యముదంపుచుండఁగా రోఁకటిపోటు చామలమీఁదఁబడినది. దీనికాంగ్లేయభాషలో "Aiming at a pigeon and killing a crow" అనునది సరిపోవును. ఈన్యాయము న్యాయవార్తికము ౭౬ పుటలో వ్రాయఁబడినది.

"శ్లో. కథం పున రన్యవిషయం కరణం అవిషయాం క్రియాం కరోతి
శాల్యాదివిషయస్య ముసలాదేఃకరణస్య శ్యామాకే అభిహతిర్భవతి.

౨౧౭. శాస్త్రఫలం ప్రయోక్తరి.

వేదోక్తకర్మఫలము వైదికకర్మల నాచరించువానికిఁ జెందును. ఈ న్యాయము వేదాంతదేశికప్రణీత తత్త్వముక్తాకలాపము 2 వ సరము, 59 శ్లోకములో నున్నది. "అన్యశ్చే దన్యకర్మప్రజనితఫలభుక్ శాస్త్రవైయాకులీ స్యాత్" దీని కాయనయే యిట్లు వ్యాఖ్యానము చేసెను.

" అన్యస్య అన్యకృతకర్మఫలభోగే శాస్త్రఫలం ప్రయోక్త
రీతి వ్యవస్థాభంగాత్ శాస్త్రస్య వ్యాకులతా స్యాత్."

౨౧౮. శిరోవేష్టనేన నాసికాస్పర్శన్యాయము.

ముక్కును జూపు మనఁగాఁ జేయి తలచుట్టుఁ ద్రిప్పిచూపించుట. రఘునాథవర్మ దీనికే ద్రావిడప్రాణాయామన్యాయ మని నామాంతర మిడెను.

౨౧౯. శ్వఃకార్య మద్య కుర్వీత.

రేపు చేయవలసినపని నీదినమందే చేయుము. ఇది శాంతిపర్వ మందున్నది.

"శ్లో॥ శ్వఃకార్య మద్య కుర్వీత పూర్వాహ్ణే చాపరాహ్ణికం
నహి ప్రతీక్షతే మృత్యుః కృతం వాస్య నవా కృతమ్."

౨౨౦. శ్వపుచ్ఛోన్నామనన్యాయము.

కుక్కతోఁక సరిగా నుండునట్లు చేయుట. అనఁగా నిష్ఫల మైన ప్రయత్నము. ఈన్యాయ ముపమితిభావప్రపంచకథయం దుదాహరింపఁబడినది.

"శ్లో॥ న చైవ శక్యతే కర్తుం సమ్రో యత్నశతై రపి,
కోహి ఖేదశతే నాపి శ్వపుచ్ఛం నామయిష్యతి."

౨౨౧. శ్వలీఢ మివ పాయసం.

కుక్కముట్టుకొనినపాయసము. అపవిత్ర మై యందువలన నపరిగ్రాహ్య మైనవస్తువుం దెలియఁజేయును. ఇది సర్వదర్శనసంగ్రహమందు

"శ్లో॥ అపిప్రయత్నసమ్పన్నం కామే నోపహతం తపః
న తుష్టయే మహేశస్య శ్వలీఢమివ పాయసం."

అనియున్నది.

౨౨౨. శ్వాకర్ణేవా పుచ్ఛేవచ్ఛిన్నే నైవభవతి నాశ్వఃగర్దభః.

చెవిఁగాని, తోఁకఁగాని ఖండించినను తురకము తురకమే గాని గాడిదయు కాఁనేరదు. ఈన్యాయమును పతంజలి "ఏకదేశ వికృత మనన్యవత్" అనుకాభాషను వ్యాఖ్యానముఁ జేయుటలోఁ జెప్పెను. తంత్రవార్తికములోఁ గుమారిలభట్టు కూడ నీన్యాయముం జెప్పెను. "న హి గో ర్దమనిజాతే విషాణే వా భగ్నే గోత్వం తిరోధీయతే."

౨౨౩. సర్వం బలవతః పథ్యం.

బలవంతుఁ డేమిచేసినను జెల్లును. గంగానాథఝా యనుపండితుఁడు "శక్తున కర్తలకు ధర్మ్యములే" అని దీని కర్థముఁ జెప్పినాఁడు. ఈయర్థము భాగవతపురాణోక్తమైన యీదిగువశ్లోకములనను సరించి యున్నది. భాగ 10-33. శ్లో 30, 31.

శ్లో. ధర్మవ్యతిక్రమో దృష్ట ఈశ్వరాణాం చ సాహసం
తేజీయసాం న దోషాయ వహ్నే స్సర్వభుజో యథా
నైత త్సమాచరే జ్జాతు మనసాపి హ్యనీశ్వరః
వినశ్య త్యాచర న్మౌఢ్యాత్ యథా రుద్రో బ్ధిజం విషం.

౨౨౪. సోపానత్కే పాదే ద్వితీయా ముపానహం అశక్యత్వా
న్నోపాదత్తే.

జోడుతొడిగిన కాలికి మఱియొకజోడు తొడుగఁబడదు. ఒకఁడు ఖండించినవిషయమునే మఱియొకఁడు చెప్పినచో నీన్యాయము వర్తించును. జైమిని ౧.౨-33. లో శబరస్వామి పూర్వపక్షిఖండించిన విషయమునే వాది తిరిగి చెప్పుట యని వ్రాసినాఁడు.

౨౨౫. స్వేదజలనిమిత్తేన శాటకత్యాగన్యాయము.

ఈన్యాయము కమిలిభావప్రకాశమునం దిట్లు వ్రాయఁబడినది. "యతో హి మహతా వత్యాపి దుర్జన చక్షుర్దోషభయా దపి వేశాదిభిః మంత్రిభిర్వ్యధ్యేతి ప్రఖ్యాపితా లోకే మనైవ అకత్యాని అన్యజనా కల్పితయా గీయంతే సోయం స్వేదజలనిమిత్తేన శాటకత్యాగన్యాయః" (కల్లులు కట్టిన పని కట్టుకొనినశాటీని విడిచిపెట్టుట) దీనితో సరియైనది యూకాభియా కంథాత్యాగన్యాయము.

౨౨౬. హిరణ్యనిధిదృష్టాంతము.

భూమిలో హిరణ్యనిధి యున్న దని తెలియక దానిపైన నడచి పోవుచుందురు. అట్లే సర్వభూతాంతరాత్ముఁడై పరమేశ్వరుఁ డున్నను తెలియఁజాలక చేతనులు వానికొఱకుఁ బైనవెదకుదురు. ఇది ఛాందోగ్యోపనిషత్తు ౮-3-౨ లో నున్నది. "య ద్యపి హిరణ్యనిధిం నిహిత మక్షేత్రజ్ఞా ఉపర్యుపరి సఞ్చరన్తో న విన్దేయుః ఏవ మే వేమా స్సర్వాః ప్రజాః అహరహ ర్గచ్ఛన్త్య ఏవం బ్రహ్మలోకం నవిన్దన్తి అనృతేన హి ప్రత్యూఢాః''

౨౨౭. ఉత్పతి తోపి హి చణకః శక్తః కిం భ్రాష్ట్రకం భఙ్క్తుమ్.

సెనగగింజ వేఁగి యెగిరిపడినను మూఁకుడును బగులఁగొట్టుటకు శక్తికలది యగునా? దుర్బలుఁడైనజనుఁడు బలవంతుడైనవానికి నేమియు నపకారముఁ జేయనేఱఁ డని తాత్పర్యము.

౨౨౮. రాత్రౌ దీపశిఖాకాంతిః నభానా వుదితే సతి.

దీపకాంతి రాత్రియందే. సూర్యోదయముకాఁగా నది యకించిత్కరము. గుణవత్తరుని దగ్గఱ గుణహీనుఁడు ప్రకాశింపనేరఁడని దీని తాత్పర్యము.

౨౭౯. పిత్తం యది శర్కరయా శామ్యతి కోఽర్థః పటోలేన.

పైత్యము పంచదారచే శమించినయెడల చేఁదుపొట్లతో నేమి పని? అనఁగా స్వల్పయత్నముచేతనే కార్యము సిద్ధించుచున్నపుడు బహుప్రయత్నములు వ్యర్థ మని తాత్పర్యము. ఇచ్చటఁ బటోలశబ్దముచేఁ బటోలపత్రము గ్రహింపఁబడుచున్నది. "పటోలపత్రం పిత్తఘ్నం మూలం తస్య విరేచకం" చేఁదుపొట్లాకు పైత్యమును హరించునదనియు దానివేరు విరేచనకారి యనియుఁ బ్రసిద్ధి.

౨౮౦. సూచీముఖన్యాయము.*

సూచీముఖ మనుపేరుగలయొకపక్షి ఒకయరణ్యమందు వానరములు చలికాలములోఁ జలిచేత వడఁకుచు నగ్నికణములనుభ్రాంతిచేత గురువెందగింజలను బ్రోగుఁజేసి యూఁది చలికాఁగుచున్నవి. అపుడు సూచీముఖ మనుపక్షి వానివ్యర్థప్రయత్నముం జూచి "మూర్ఖులారా! ఇది యగ్ని కాదు. దీనివలన శీతబాధ నివారింపఁబడదు. కావున నొకకొండగుహలోనికిఁ గాని గాలిలేని ప్రదేశమునకుఁగాని పోయి యున్నయెడల నీశీతబాధానివారణ మగును." అని తఱచుగా వానరముల కుపదేశించెను. అందుపై నొకవృద్ధవానరము కోపముఁ దెచ్చుకొని దానిపైఁబడి ఱెక్కలుపట్టుకొని రాతిపైఁగొట్టి చంపివేసెను. కావున దుష్టులకెపుడును మంచి నుపదేశింపరాదు.

౨౮౧. స్వజాతి ర్దురతిక్రమా.

(తనజాతి విడువ శక్యముకాదు.) ఇందుల కొకగాథ కలదు." ఒకనాఁ డొకముని గంగాజలమందు స్నానముచేయుచుండఁగా డేగముఖమునుండి జారిపోయినయెలుకపిల్ల యతనిచేతిలోఁ బడెను. అంతట నాముని దయార్ద్రహృదయుఁడై తనతపోబలముచే నామూషికము నొక

*చూ. ౧౦౯. న్యాయము. దీనికి దానికి నించుకవిషయభేదము కలదు.

కన్యకగాఁ జేసి సంతానములేని తనభార్య కిచ్చెను. ఆమె యాపుత్రికను గారాబముతోఁ బెంచుచుండఁగాఁ గాలక్రమమున వరార్హ మైనవయస్సుకలది యాయెను. అపుడాముని వాయుదేవుని సూర్యుని మేఘుని తపోబలముచే రప్పించి తనకన్యకకుఁ జూపి "పుత్రి! ఈముగ్గురిలో నీయిష్టము వచ్చినవానిని వరింపు మనెను. ఆమె వాయువు నతిచపలాత్మకుఁడని యు, అగ్నిని కృష్ణమార్గసంచారియనియు, సూర్యుని భ్రమణశీలుఁడనియు దోషము లెంచి వారిని బెండ్లియాడుట కిష్టపడలేదు. అపుడాముని యొకయెలుకను దీసికొనివచ్చి దీనిని బెండ్లియాడెదవా యని యడిగెను. అంతట కాకన్యక భగవంతుఁడా! నన్ను మరల మూషకముగాఁ జేసి దానికిఁ బెండ్లిఁ జేయుమని కోరెను. ["సూర్యం భర్తారముత్సృజ్య పర్జన్యం మారుతం తథా స్వజాతిం మూషికా ప్రాప్తా స్వజాతి ర్దురతిక్రమా.]

౨౩౨. శ్వశుష్కాస్థిన్యాయము.

కుక్క మాంసములేనిది యెండిపోయినది యగునొక యెముకను బట్టుకొనిపండ్లవెంట నెత్తురు వచ్చువఱకుఁ గొరుకుచుండును. అట్లే నీచుఁడు ఫలము లేకపోయినను నిష్ఫల మైనవస్తువును బట్టుకొని విడువఁడు.

తే. గీ. మేడెపల్లన్వవాయుఁడు మితవిదుండు
వేంకటేశుఁడు నేర్చినవిధముకొలఁది
లౌకికన్యాయసమితికి లఘువుగాను
వివరణము వ్రాసి ప్రకటించె విబుధు లలర.